# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం-09-నవంబర్-2025 | సంపుటి:3 | సంచిక:161 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in


## ప్రధాని నరేంద్ర మోదీ నుంచి సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

- ఆరోగ్యంగా, దీర్ఘాయుష్షుతో ఉండాలని అభిలాష
- సోషల్ మీడియాలో శుభాకాంక్షల వెల్లువ



**హైదరాబాద్, నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా వేదిక X (పూర్వపు ట్విట్టర్) ద్వారా జన్మదిన శుభాకాంక్షలు పంపిన మోదీ, రేవంత్ రెడ్డి ఆరోగ్యంగా సుఖంగా దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షించారు. రాజకీయ భేదాలు ఉన్నప్పటికీ, మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని ట్వీట్ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. “Birthday greetings to Telangana Chief Minister Revanth Reddy. May he be blessed with a long and healthy life,” అంటూ మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

మరోవైపు, రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ నేతలు, మంత్రివర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలు కూడా సోషల్ మీడియా వేదికలపై భారీగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. హైదరాబాదు నుండి జిల్లా కేంద్రాల వరకూ పుట్టినరోజు వేడుకలు నిర్వహించేందుకు కాంగ్రెస్కార్యకర్తలు సిద్ధమవుతున్నారు.

ట్వీట్‌లో రేవంత్ రెడ్డి అధికారిక హ్యాండిల్‌ను ట్యాగ్ చేసిన మోదీ సందేశం, కేంద్రరాష్ట్ర సంబంధాల నేపథ్యంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణ రాజకీయ పరిణామాల్లో ఇది ఒక సానుకూల సంకేతంగా పరిశీలిస్తున్నారు.

## సీఎంకు శుభాకాంక్షల వరద



### రాష్ట్ర నేతలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పలుకరింపు

**హైదరాబాద్, నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన నివాసం, కార్యాలయం సందడి వాతావరణాన్ని సంతరించుకుంది. ఉదయం నుంచే రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఇతర ప్రముఖులు వరుసగా కలుసుకుని ముఖ్యమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మరియు ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు వ్యక్తిగతంగా సీఎం రేవంత్‌ను కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేశారు.

మిగతా 2లో..



## వరద బాధితులకు సహాయం ఎక్కడ?

### సమ్మయ్య నగర్‌లో కుటుంబాలను పరామర్శించిన కవిత

**హైదరాబాద్, నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** వరదలతో నష్టపోయిన కుటుంబాల పరిస్థితిని తెలుసుకునేందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శనివారం హన్మకొండలోని సమ్మయ్య నగర్‌ను సందర్శించారు. “జాగృతి జనంబాట” కార్యక్రమం భాగంగా బాధితులను కలుసుకుని వారి ఆవేదనను ఆత్మీయంగా విన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ముఖ్యమంత్రి హన్మకొండ వచ్చి హామీలు ఇచ్చి 15 రోజులు గడిచినా, ఒక్క కుటుంబానికీ సహాయం అందలేదని విమర్శించారు. “ముఖ్యమంత్రి మాట గవర్నమెంట్ ఆర్డర్‌లా ఉంటుందని గతంలో ఆయనే అన్నారు. అయితే ఇక్కడ ఇచ్చిన మాటలు అమలులో కనిపించడం లేదు” అని కవిత వ్యాఖ్యానించారు. వరదల వల్ల ఇళ్లలో సామాను నష్టం, జీవనోపాధి దెబ్బతినడం, పిల్లల చదువుపై ప్రభావం వంటి సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. బాధితులకు తక్షణ ఆర్థిక సాయం, పునర్వాస చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మిగతా 2లో..

## సోషల్ మీడియా వేధింపులపై మౌనం వీడండి

### తెలంగాణ పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్, నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న వేధింపులు, బెదిరింపులపై ఎవరూ మౌనం పాటించకూడదని తెలంగాణ పోలీసు శాఖ వినతి చేసింది. బాధితులు భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

సోషల్ మీడియాలో ఎవరైనా అవమానకర వ్యాఖ్యలు, అసభ్య సందేశాలు, బెదిరింపులు లేదా వ్యక్తిగత సమాచారం పంచుకుంటూ వేధిస్తే వేగంగా స్పందించాలని తెలిపారు. ముఖ్యంగా తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన మెసేజ్‌లు, ఫ్రెండ్ రిక్వెస్టులు, లింకులు, వీడియో కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. అపరిచితులతో చాట్ చేయడం, వ్యక్తిగత ఫోటోలు-వీడియోలు షేర్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. అనుమానాస్పదమైన ఆన్‌లైన్ సంభాషణలను వెంటనే స్క్రీన్‌షాట్ తీసి ఆధారాలతో పాటు సమీప సైబర్ క్రైమ్ పోలీసులకు దాఖలు చేయాలని సూచించారు.పోలీసుల సమాచారం మేరకు, చాలా మంది వేధింపులకు గురైనా సిగ్గు, భయం, కుటుంబం-సమాజం అన్న భావనతో మౌనం పాటిస్తున్నారని, అదే నేరస్థులకు మరింత ధైర్యం ఇస్తోందని పేర్కొన్నారు. “మౌనం కాదు, ఫిర్యాదు మీ రక్షణ ఆయుధం” అన్న నినాదంతో అవగాహన ప్రచారాన్ని ప్రారంభించారు.




పిల్లలు, యువత, మహిళలు ముఖ్యంగా సోషల్ మీడియా వేదికల్లో అప్రమత్తంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా 1930 నెంబరు లేదా www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చెయ్యాల్సిందిగా కోరారు.

సైబర్ వేధింపులపై తెలంగాణ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తామని, బాధితుల గోప్యతను పూర్తిగా కాపాడతామని హామీ ఇచ్చారు.



## కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు పాస్టర్ల ఏకగ్రీవ మద్దతు

**హైదరాబాద్, నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు తెలుపుతూ పాస్టర్ల సమావేశం శనివారం జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో కీలక నాయకులు పాల్గొనడంతో కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకట్‌స్వామి, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీలు విశ్వనాథ్, సంపత్ కుమార్, దీపక్ జాన్ తదితరుల సమక్షంలో ఈ సమావేశం జరిగింది. జూబ్లీహిల్స్ అభివృద్ధికి పార్టీలో సమగ్ర ప్రణాళిక సిద్ధమైనట్లు నేతలు వెల్లడించారు. ప్రాంత ప్రజలకు మెరుగైన సదుపాయాలు, సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వమే భరోసానిస్తుందని నేతలు హామీ ఇచ్చారు. స్థానిక సమస్యలను అర్థం చేసుకునే, ప్రజలకు అందుబాటులో ఉండే యువ నాయకుడు నవీన్ యాదవ్‌ను గెలిపించాల్సిన అవసరాన్ని పాస్టర్లు వివరించారు. నవంబర్ 11న జరిగే ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు పాస్టర్లు ఏకగ్రీవంగా ప్రకటించారు. ప్రతి ఓటరు ప్రజాస్వామ్యాన్ని బలపర్చే విధంగా ఓటు హక్కును వినియోగించాలని నేతలు పిలుపునిచ్చారు.

## సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పొంగులేటి



**హైదరాబాద్, నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సత్కరించారు. సీఎం నివాసంలో రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ సర్వతోముఖ అభివృద్ధి సాధిస్తుందన్న నమ్మకం వ్యక్తం చేశారు. “#RisingTelangana2047” లక్ష్య సాధనలో సీఎం చూపిస్తున్న దిశా నిర్దేశం రాష్ట్ర పురోగతికి తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆశయాలు నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి విజయపథంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరెన్నో విజయాలు సాధిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని పొంగులేటి హృదయపూర్వకంగా ప్రార్థించారు.

## రామ్‌కో సిమెంట్ కంటే కిషన్–రేవంత్ బంధం దృఢం



- జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ వ్యంగ్యం

**హైదరాబాద్, నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సమీపిస్తున్న వేళ రాజకీయ వ్యాఖ్యలు మరింత కఠినంగా మారుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి మధ్య ఉన్న సంబంధాలను ఎద్దేవా చేస్తూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆగ్రహ వ్యాఖ్యలు చేశారు. రామ్‌కో సిమెంట్ కంటే బలమైన బంధం వీరిద్దరిది అని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన బాల్క సుమన్, “కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి పెద్దమ్మ-చిన్నమ్మల కొడుకుల్లా ఉంటారు.

మిగతా 2లో..

## “జాతీయత, ప్రజాస్వామ్యానికి ఆదర్శప్రాయ నేత”

### ఎల్.కే. ఆడ్వాణీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కిషన్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రత్న లాల్‌కృష్ణ ఆడ్వాణీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి, బీజేపీ నేత జీ. కిషన్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలకు మార్గదర్శకుడైన ఆడ్వాణీ, దేశ రాజకీయాలలో కీలక మార్పులకు నాంది పలికిన మహానుభావుడని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి సోషల్ మీడియాలో స్పందిస్తూ, “భారతదేశ రాజకీయ పయనాన్ని మార్చిన మహోన్నత నాయకుల్లో ఆడ్వాణీ జీ అగ్రగణ్యులు. జాతీయత, ప్రజాస్వామ్యం, సాంస్కృతిక గర్వం అనే విలువలకు జీవితాంతం కట్టుబడి పనిచేసిన వ్యక్తి” అని కొనియాడారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సీఎంకు శుభాకాంక్షల వరద







(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర అభివృద్ధి పథంలో ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు రేవంత్ రెడ్డి తీసుకుంటున్న పరిపాలనా నిర్ణయాలు, ప్రజాకర్షక విధానాలు, సంక్షేమ-అభివృద్ధి చర్యలను ప్రశంసిస్తూ, తెలంగాణను దేశంలో స్ఫూర్తిదాయక రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ఆయన విజన్ కీలకమని పేర్కొన్నారు. సీఎం పుట్టినరోజును పురస్కరించుకుని కొంతమంది నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ముఖ్యమంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ప్రేమ, నాయకుల ఆశీర్వాదం తనకు మరింత శక్తినిస్తుందనీ, తెలంగాణను సమగ్ర ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్లే బాధ్యతను మరింత నిబద్ధతతో నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు.



# వరద బాధితులకు సహాయం ఎక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు మాటలు కాదు, మంచినీళ్లు, ఆహారం, పరిహారం, పునరావాసం వంటి చర్యలు కావాలి. తెలంగాణ జాగృతి ఎప్పటికీ ప్రజల పక్షానే నిలుస్తుంది. బాధిత కుటుంబాల కోసం మా మద్దతు కొనసాగుతుంది అని కవిత హామీ ఇచ్చారు.

# రామ్‌కో సిమెంట్ కంటే కిషన్–రేవంత్ బంధం దృఢం

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ సీఎంకు దొరకని అపాయింట్‌మెంట్ రేవంత్‌కు దొరుకుతుంది. బీజేపీ ఎంపీలతో రేవంత్‌కు ఉన్న సన్నిహిత్యం అందరికీ తెలుసు" అని వ్యాఖ్యానించారు. టీడీపీ కాలంలోనే రేవంత్-కిషన్‌ల మధ్య సంబంధాలు గాఢమైయ్యాయని అన్నారు. బీజేపీ ఎంపీలు రేవంత్ కోసం పనిచేస్తున్నారని ఆరోపించిన సుమన్, "బండి సంజయ్ తెలంగాణలో రేవంత్‌కు సహాయ మంత్రి వంటివారు. బీజేపీ ఎంపీలు మెంబర్ ఆఫ్ రేవంత్ రెడ్డిలా మారిపోయారు" అని వ్యంగ్యాస్త్రాలు వేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంపై కూడా సుమన్ విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ తొమ్మిది రోజులు గల్లీగల్లీ తిరుగుతున్నారంటే ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ భాష, ప్రవర్తన చూస్తుంటే ఓటమి అవశ్యమని పేర్కొన్నారు.

అధికార దుర్వినియోగం జరుగుతోందని ఆరోపించిన బాల్క సుమన్, "ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ ఇళ్లపై పోలీసులు రైడ్లు చేశారు. జూబ్లీహిల్స్ పరిధిలో వారి ఇళ్లు లేకపోయినా టార్గెట్ చేశారు. ఎలాంటి సాక్ష్యం లభించలేదని పోలీసులు చెప్పినా, డ్రామా కొనసాగిస్తున్నారు" అని మండిపడ్డారు. కాంగ్రెస్-బీజేపీ కలిసిపోయి పోటీ చేస్తున్న ఉపఎన్నిక ఇదేనని సుమన్ ఆరోపించారు. "జూబ్లీహిల్స్‌లో కుక్కర్లు పంచుతూ, గూగుల్ పే-ఫోన్ పే చేస్తామని ఓటర్లను ఆకర్షిస్తున్నారు. ఎన్నికల కమిషన్, పోలీసులు అధికార పార్టీ ఏజెంట్లలా పనిచేస్తున్నారు. బైండోవర్ చేసిన 140 మందిని ఎన్నికల రోజు బయటకు రానివ్వద్దని కోరుతున్నా" అని అన్నారు.

పోలీసులు రేవంత్ రెడ్డి ప్రైవేట్ సైన్యంలా వ్యవహరిస్తున్నారని, ఇది ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రాజకీయ శైలిని గుర్తుకుతెస్తోందని వ్యాఖ్యానించిన బాల్క సుమన్, చట్టపరమైన నైతికతకు విరుద్ధంగా పని చేయవద్దని అధికారులకు సూచించారు.

# జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం ఈ ఉపఎన్నిక కీలకం

## ఓటు హక్కు వినియోగించాలని పిలుపునిచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):

జూబ్లీహిల్స్ ఉపఎన్నికను ప్రాంత అభివృద్ధికి అవకాశంగా వినియోగించుకోవాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఈ సమయంలో, జూబ్లీహిల్స్ ప్రాంతానికి మరింత అభివృద్ధి సాధించడానికి ఇదే సరైన సమయం అని ఆయన వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యం. గతంలో కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో అభివృద్ధి ఆశయంతో కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టారు. అలాగే ఈసారి కూడా జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి దిశగా నడిపించాలని అన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ స్థానికుడు, యువకుడు, విద్యావంతుడు కావడం ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో ఉపయుక్తమని పేర్కొంటూ, ఆయనకు తమ అమూల్యమైన ఓటు వేయాలని ప్రభాకర్ కోరారు. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కార మార్గం చూపగల యువ నాయకత్వం అవసరమని గుర్తు చేశారు. నవంబర్ 11న జరగనున్న ఉపఎన్నికలో పోలింగ్ పట్ల ప్రజల్లో మరింత ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం ఆ రోజు సెలవు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఓటరు తప్పకుండా ఓటు హక్కు వినియోగించి ప్రజాస్వామ్య బలపరచాలని పిలుపునిచ్చారు.



# అంగోలా, బొట్స్‌వానాకు ప్రథమ రాష్ట్రముఖ్య పర్యటనకు ప్రస్థానమైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

హైదరాబాద్, నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అంగోలా మరియు బొట్స్‌వానా దేశాల అధికారిక పర్యటనకు న్యూఢిల్లీ నుంచి బయలుదేరారు. భారత దేశాధ్యక్షురాలు ఈ రెండు ఆఫ్రికన్ దేశాలను రాష్ట్రమర్యాద పూర్వకంగా సందర్శించడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పర్యటనలో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, వాణిజ్యం-పెట్టుబడులు, విద్య, ఆరోగ్యం, ఐటీ, రక్షణ సహకారం వంటి రంగాల్లో కొత్త అవకాశాలపై చర్చలు జరగనున్నాయి. అంతర్జాతీయ వేదికలపై కలిసి పని చేయడం, గ్లోబల్ సౌత్ దేశాల పరస్పర పురోగతిపై భారత్ తీసుకుంటున్న ముందడుగులో భాగంగా ఈ పర్యటన సూచికగా భావిస్తున్నారు. భారత రాష్ట్రపతి సందర్శనతో ఆఫ్రికా ఖండంతో భారత సంబంధాలు మరింత బలపడుతాయని దౌత్యవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.





# జాతీయ ఆధ్యాత్మిక విలువలకు జైనచార్యుల ఉపవాసం ప్రేరణ

## ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

హైదరాబాద్, నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):



జైన ఆచార్య హంసరత్న సూరీశ్వర్‌జీ మహారాజ్ నిర్వహించిన ఎనిమిదో "180 ఉపవాస పర్ణ" మహోత్సవానికి ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యూఢిల్లీలోని విఘాన్ భవన్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొని, ఆచార్యజీ చూపిన ఆధ్యాత్మిక తపస్సును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, వరుసగా ఎనిమిదో సారి 180 రోజుల దీర్ఘ నిరాహార దీక్ష చేపట్టడం అసామాన్యం అని పేర్కొన్నారు. "ఇది వ్యక్తిగతంగా కాదు, దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక మేలుకోసం చేసిన తపస్సు. ఇటువంటి త్యాగం దేశానికి స్ఫూర్తి" అని అన్నారు. మానవ నాగరికతలో అత్యంత పురాతన మతాలలో జైనమతం ఒకటేనని, భారతీయ తత్త్వశాస్త్రం, సాహిత్యం, నైతిక విలువలపై దాని ముద్ర విశిష్టమైందని రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు. అహింస, కరుణ, సహజీవన సూత్రాలు నేటి ప్రపంచానికి అత్యవసరమని, పర్యావరణ పరిరక్షణలో కూడా జైనమతం చూపే తత్వబోధ ప్రాముఖ్యాన్ని ఆయన వివరించారు. తన వ్యక్తిగతంగా శాకాహార జీవనశైలికి మారిన అనుభవాన్ని పంచుకున్న ఉపరాష్ట్రపతి, ఆ మార్పు తనలో సహనం, అనుభూతి, ఆత్మ శాంతి పెంచిందని తెలిపారు.

గత ఏడాది ప్రాకృత భాషకు భారత ప్రభుత్వం పురాతన "ప్రాచీన క్లాసికల్ లాంగ్వేజ్" హోదా ఇవ్వడం పట్ల గర్వంగా ఉందని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. జైన పుస్తకాలతో సహా దేశంలోని ప్రాచీన పాండులిపులను డిజిటల్ రూపంలో సంరక్షిస్తున్న "జ్ఞాన్ భారత్‌మ్ మిషన్"ను ఆయన అభినందించారు. తమిళనాడు, జైనమతానికి మధ్య ఉన్న శతాబ్దాల అనుబంధాన్ని స్మరించిన ఉపరాష్ట్రపతి, సంగం సాహిత్యం, శిలప్పదికారం వంటి ఇతిహాసాలు, జైన కవుల సాహిత్య వారసత్వం, పూర్వకాల దేవాలయాలు భారత సాంస్కృతిక వైవిధ్యానికి సాక్ష్యాలని అన్నారు. డిజిటల్ యుగంలో మన మూలాలకు దూరమవుతున్న తరుణంలో ఆధ్యాత్మిక గురువుల బోధలతో న్యాయం, కరుణా, ఐక్యతతో కూడిన భారత్ నిర్మించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు.

# "దెయ్యం వదిలించాలి" పేరుతో మహిళపై అమానుషం

- మద్యం, సిగరెట్లు బలవంతంగా తాగించిన మంత్రగాడు అరెస్టు

శాస్త్ర సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా మూఢనమ్మకాలు ఇంకా సమాజాన్ని వెంటాడుతున్నాయి. కేరళలో జరిగిన ఓ దారుణ ఘటన దీనికి నిదర్శనం. "దెయ్యం పట్టింది" పేరుతో మంత్రగాడు ఓ మహిళను మద్యం, సిగరెట్లు బలవంతంగా తాగించి చిత్రహింసలకు గురిచేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. కొట్టాయం జిల్లాకు చెందిన 26 ఏళ్ల మహిళ అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో భర్త అఖిల్ దాస్ స్థానిక మంత్రగాడు శివదాస్‌ను సంప్రదించాడు. ఆమెకు దెయ్యం పట్టిందని నమ్మించిన శివదాస్, క్షుద్రపూజ చేయాలని సూచించాడు. బుధవారం రాత్రి ఇంట్లో పూజల పేరుతో శివదాస్ అమానుషానికి ఒడిగట్టాడు. పూజల మధ్య మహిళకు బలవంతంగా ఆల్కహాల్ తాగించడం, సిగరెట్టుల పొగ పీల్చించడం, బూడిద తినిపించడం, శరీరంపై వాతలు పెట్టడం వంటి హింసాత్మక చర్యలకు పాల్పడ్డాడు. రాత్రంతా క్షుద్రపూజలు సాగగా, తీవ్ర వేధింపులు భరించలేక మహిళ స్పృహ తప్పిపోయింది. స్పృహ వచ్చిన తరువాత పోలీసులు వద్ద ఫిర్యాదు చేసిన బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం మంత్రగాడు శివదాస్, మహిళ భర్త అఖిల్ దాస్ మరియు మామను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న అత్త కోసం గాలింపు కొనసాగుతోంది. బాధితురాలు శనివారం మీడియాతో మాట్లాడుతూ, "రాత్రి 11 గంటలకు పూజలు మొదలయ్యాయి. రాత్రంతా నన్ను హింసించారు. ఆల్కహాల్, సిగరెట్ల బూడిద బలవంతంగా తినిపించారు. నా శరీరంపై వాతలు పెట్టారు. టార్చర్ భరించలేక నేను స్పృహ తప్పిపోయాను" అంటూ కన్నీటి పర్యంతమైంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర ఆగ్రహం రేపింది.



# ఘనంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

**హసన్ పర్తి,నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** హసన్ పర్తి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టిన రోజును 66 వ డివిజన్ కాంగ్రెస్ అధ్య క్షులు కనపర్తి కిరణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలభిషేకం నిర్వహించారు. నిరుపే దలకు పండ్ల పంపిణీ చేసి శ్రీ ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్ఐసి వెంకన్న,వీసం సురేందర్ రె డ్డి,ఆరెల్లి వెంకటస్వామి,జన్ను రవీంద ర్,పుల్ల రవీందర్,కోడెల మురళి,తాళ్ల మధు,పెద్దమ్మ నరసింహారావు,గరిగా రాజు,పెద్దమ్మ సురేష్,మూల తిరుప తి,పోతరాజు ప్రభాకర్,శీలం రమేష్ వేల్పుల సాంబయ్య,శీలం పృథ్వీరాజ్, వల్లాల గంగన్న,పల్లెపు అనుష,బోడ కిషోర్,మొగిలి,పుల్ల రమేష్,వాస్తు రవీం దర్,బాబు,కనపర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి సి.ఎస్.ఆర్. నిధులతో విద్యార్థులకు స్కూల్ సామగ్రి పంపిణీ.!

**చిన్నారులకు అందజేసిన జి.ఎం చింతల శ్రీనివాస్**

**సత్తుపల్లి, నవంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియాకు చెందిన సత్తుపల్లి జి.ఎం చింతల శ్రీనివాస్, శనివారం స్థానిక ఎంపీపీ ఎస్ కిష్టారం స్కూలు, ఎంపీపీ ఎస్ కిష్టారం హరిజనవాడ స్కూలు, ఎంపీపీ ఎస్ ఎస్సీ కాలనీ పాఠశాల లకు చెందిన 135 మంది విద్యార్థు లకు నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులు, షూస్, సాక్స్, టై మరియు బెల్టులను సింగరేణి సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జి.ఎం చిన్నారులతో మాట్లాడుతూ, మీరు బాగా చదివి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలి అని పిల్లలకు ఆశీర్వచనాలు అందించారు.
ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వి. నరసింహారావు, కిష్టారం ఓసి నరికుల్లా రవికుమార్, జనార్ధన్, కిష్టారం గ్రామస్తులు మరియు వెల్ఫేర్ ఆఫీసర్ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సింగరేణి సి.ఎస్.ఆర్. నిధులతో విద్యార్థులకు స్కూల్ సామగ్రి పంపిణీ.!

- **ఖమ్మం జిల్లా కుర్రోడికి అదృష్టం తలుపు తట్టింది**
- **లాటరీలో ఏకంగా 240 కోట్లు**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 8, తెలంగాణ ముచ్చట్లు;** ఒక సామాన్య కుటుంబంలో పుట్టిన యువకునికి లాటరీ అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. ఒక్క సారిగా అతను సెలబ్రిటీ అయిపోయా డు చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశా లలో చదువుకొని ఉన్నత చదువులు పూర్తి చేసి..ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన ఆ యువకునికి అదృష్టం లాటరీ రూపంలో వరించింది.తన తల్లి పుట్టిన తేదీ 11 సంఖ్యతో లాటరీ టికెట్ కొ న్నాడు.ఆ అదృష్ట సంఖ్య 11 అతని జీవితాన్నే మార్చేసింది.ఏకంగా 240 కోట్ల రూపాయలు లాటరీ తగిలింది. ఏది ఏమైనా అదృష్టం అంటే ఇలా ఉండాలి అని ఆ ఊరి జనాలు చెప్పుకుంటున్నారు. తమ ఊరి వాడికి అబుదాబిలో 240 కోట్లు లాటరీ తగిలిందంటే.. మామూలు అదృష్టం కాదని.. తమకు గర్వంగా ఉందని సం తోషాన్ని వ్యక్తం చేస్తు న్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం భీమవరం గ్రామం పేరు ఇప్పుడు మారుమోగిపోతుంది భీమవరం గ్రా మానికి చెందిన గొల్ల అనిల్ కుమార్ అనే యువకుడు అబుదాబి దేశంలో ఏడాదిన్నరగా సాఫ్ట్ వేర్ ఉద్యోగం చే స్తున్నాడు. అయితే అక్కడ తన స్నేహి తుల సూచనల మేరకు లాటరీ టికెట్ కొనుగోలు చేశాడు.తన తల్లి భూలక్ష్మి పుట్టిన తేదీ 11వ తేదీ కావడంతో..దాన్నే లక్కీ నంబర్‌గా భావించి లాటరీ టికెట్ కొనుగోలు చేశాడు.ఆ సంఖ్య అతనికి కలిసొచ్చింది. ఏకంగా అదృష్టం కలిసి వచ్చి 240 కోట్ల లాటరీ తగిలింది.తన కుమారుడికి లాటరీ టికెట్ ద్వారా కోట్ల రూపాయలు వచ్చాయంటే తల్లిదం డ్రులు నమ్మలేకపోతున్నారు. ఆ దేవుడే తమకు ఈ మేలు చేశాడని ఆనందపడు తున్నారు.



# ఘనంగా నారాయణా ప్రీమియర్ లీగ్ – జోనల్ క్రీడా సమ్మేళనం

- **విద్యతో పాటు క్రీడా రంగంలోనూ విద్యార్థుల ప్రతిభ.**

**త్తుపల్లి, నవంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** నారాయణా విద్యాసంస్థల ఆధ్వర్యంలో ని ర్వహించిన "నారాయణా ప్రీమియర్ లీగ్ - జోనల్ స్పోర్ట్స్ మీట్" ఖమ్మం లోని ఎస్.ఆర్ మరియు బి.జి.ఎన్.ఆర్ మైదానాలలో ఎంతో ఉత్సాహభరితంగా, క్రీడాస్ఫూర్తితో సాగింది. పాల్వంచ, సత్తుపల్లి, ఖమ్మం ఓ.ఎన్.సి.ఎస్, ఖమ్మం ఇ.ఎన్.సి.ఎస్ శాఖలకు చెందిన వి ద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు.
కార్యక్రమానికి ఏ.జి.యం ప్రధాన అతిథిగా హాజరై విద్యార్థులకు ఉత్సాహాన్ని నింపారు. ఆయన మాట్లాడుతూ, నారాయణ విద్యా ర్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా ముందుండాలి. క్రీడలు విద్యార్థుల్లో క్రమశి క్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు భావన, నాయ కత్వ లక్షణాలను పెంపొందిస్తాయి అని అన్నారు.



లాగే హైస్కూల్ సమన్వయకర్త ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు రామ్ మూర్తి, రేఖ, నరసింహరావు, అమల కూడా విద్యార్థుల కు ప్రోత్సాహం అందిస్తూ క్రీడా ప్రాముఖ్య తను వివరించారు. ప్రతి పాల్గొనే విద్యార్థి ధైర్యంగా, నమ్మకంగా ముందుకు సాగాలని వారు సూచించారు.
జోనల్ స్పోర్ట్స్ మీట్ విజయవంతం కావడంలో శారీరక విద్య ఉపాధ్యాయులు చందు, వీరు, గోపిరాజు, వినయ్ కీలకపా త్ర పోషించారు. విభిన్న జోన్ల మధ్య జరిగిన ఉత్సాహపూర్వక పోటీలు, విద్యార్థుల క్రీడా స్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది.
పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలు, ప్రత్యేక బహు మతులు అందజేయడం జరిగింది.







# జూబ్లీహిల్స్ పేరుకే మెట్రో లుక్‌లో ఉన్నా... ప్రజల పరిస్థితి దయనీయంగా ఉంది

## ఎంపీ ఈటల రాజేందర్

**జూబ్లీహిల్స్, నవంబర్ 8 (తెలంగాణ ముచ్చ-ట్లు):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం లో భాగంగా వెంగళరావు నగర్ డివిజన్‌లోని మధురానగర్‌లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వ హించిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులపై తీవ్ర విమర్శలు చేశారు."పేరుకు మాత్రమే జూబ్లీ హిల్స్, పైన పటారం..లోన లోటారం. ఇక్కడి బస్తీల్లో ప్రజలు దుర్భరమైన జీవితం గడుపు తున్నారు. మనం నిలబడ్డ ఈ మధురానగ ర్‌లో కూడా కంపు కొడుతోంది" అని ఆయన అన్నారు.కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఒకరిని ఒకరు విమర్శించుకోవడం తప్ప ప్రజల అభి వృద్ధి కోసం ఏమీ చేయలేదని ఈటల వ్యాఖ్యా నించారు. "పదేళ్ల బిఆర్ఎస్ పాలనలోనూ, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనూ రోడ్లు సరిచే యడం లేదు, తాగునీరు అందించడం లేదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎవరూ శ్రద్ధ చూపడం లేదు" అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి హామీలు నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. "మహిళలకు రూ.2,500, ఆటో డ్రైవర్లకు రూ. 12,000, నిరుద్యోగ భృతి రూ.4,000, పెన్షన్ రూ.6,000 — ఏ ఒక్కటి అమలు కాలేదు. ఫీజు రీయిం బర్స్‌మెంట్‌లో కూడా రూ.10 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ ఇవ్వకుండా మళ్లీ ఓటు అడుగుతున్నారు. ప్రజలు నిలదీ యాలి" అని పిలుపునిచ్చారు. ఓటుకు డబ్బు పంచుతున్నారన్న ఆరోపణలూ చేశారు. "ఓటుకు రూ.2,000 పంచుతున్నారట. ఎవరి అబ్బ సొమ్ము ఇది?" అని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకపోయినా, పేదల గుడిసెలను హైడ్రాలతో కూల్చేస్తున్నారని వి మర్శించారు."ప్రజల హక్కుల కోసం, పేదల ఇళ్ల జాగాల కోసం, పెన్షన్‌ల కోసం, ఫీజుల కోసం బీజేపీ మాత్రమే పోరాడుతుంది. జి హెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ 48 స్థానాలు గెలిచింది. మళ్లీ బీజేపీ జెండా ఎగరాలని కోరుకుంటున్నాం" అని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, "ఇస్తే తీసుకోండి, కానీ ఓటు మీ ఆత్మగౌరవం కోసం వేయండి" అని ఆయన పిలుపునిచ్చారు.స్థానిక బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించిన ఈటల రాజేందర్, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.





# విజయవంతంగా 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు

**ఖమ్మం బ్యూరో, నవంబర్ -8, తెలంగాణ ముచ్చట్లు;** 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు వైరా స్థానిక టి.జి.ఎస్.డబ్ల్యు.ఆర్. ఎస్. జూనియర్ కళాశాల (బాలికలు)లో ఘనంగా నిర్వహించబడ్డాయి. శనివారం ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వి ద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు, ఆటల ప్రాము ఖ్యతను వివరించారు. విజయం సాధించాల నే ప్రయత్నం చేయాలని, అపజయంలోనూ ధైర్యంగా ఉండాలని, జీవితంలో ధైర్యం ఎప్పుడూ వదిలి పెట్టకూడదని విద్యార్థులకు సూచించారు. లక్ష్య సాధనలో కృషి, నిబద్ధత, పట్టుదల ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ సందర్భంగా అండర్14, 17, 19 విభా గాల్లో గెలిచిన విజేతలకు, రన్నర్ అప్స్‌కు బహుమతుల ప్రదానం చేశారు. ప్రతి విద్యార్థి భాగస్వామ్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం గా నిర్వహించిన ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్, పి.ఈ.టి. లను, స్కూల్ టీమ్ కృషిని అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్య క్రమంలో మల్టీ జోనల్ అధికారి కె.అలివేలు, డిసిఓ ఎం. రాజ్యలక్ష్మి, స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సమత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

## తిరుమలనగర్ కాలనీలో మిగిలిన అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేస్తాం



కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్

**కాప్రా, నవంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** మీర్పేట్ హెచ్.బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలంటూ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్‌కు వినతిపత్రం అందజేశారు.కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు పూర్తయిన పనులు మినహా ఇంకా మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, "తిరుమలనగర్ కాలనీలో డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు పనులు కొంతవరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులు త్వరగా పూర్తయ్యేలా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి చర్యలు చేపడతాం" అని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో సెక్రటరీ అమరేంద్ర బాబు, కోశాధికారి బీడీ దాస్, లీగల్ అడ్వైజర్ శ్రీను, కృష్ణ మోహన్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ గెలుపు కోసం జోరుగా ప్రచారం చేసిన డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి



**వనపర్తి,నవంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిస్తూ తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షుడు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ప్రచారం చేపట్టారు.

శనివారం మధురనగర్ ప్రాంతంలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య రెడ్డి ,ఏఐసీసీ పరిశీలకులు కుసుమ కుమార్ కలిసి గడపగడప తిరుగుతూ ప్రజలను కలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై ఓటు వేసి నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని, నవీన్ యాదవ్ యువ నాయకుడిగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు. తెలంగాణలో సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రావడం అత్యవసరమని ఆయన అన్నారు.

ఈ ప్రచార కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, వనపర్తి జిల్లా కోర్ట్ ప్లీడర్ కిరణ్ కుమార్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు రోహిత్, వనపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, సీనియర్ నాయకులు మెంటేపల్లి రాములు, ఎంట్ల రవి, కోళ్ల వెంకటేష్,సురేష్, పాండురవ్, రమేష్, రాంజీ నాయక్, అలాగే ఏఐసీసీ విభాగ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కూసుమంచి క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ఖమ్మం బ్యూరో, నవంబర్ 8, తెలంగాణ ముచ్చట్లు;** కూసుమంచిలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.... ఇళ్లులేని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు సహాయం, యువతకు ఉపాధి అవకాశాలు ఇవన్నీ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పుల సంకేతాలని పేర్కొన్నారు. పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే సంక్షేమ పాలన రాష్ట్రంలో అమలవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల యుగంధర్ మానవతా హస్తం





- ముంపు బాధిత విద్యార్థులకు అండగా.. ఆపద్బాంధవుడిగా నిలిచిన నేత
- నోట్ బుక్స్, బ్యాగులు పంపిణీ
- చిన్నారులతో సహపంక్తి భోజనం

**ఖమ్మం బ్యూరో,నవంబర్ 7, తెలంగాణ ముచ్చట్లు;** ఇటీవల అకాల వర్షాల ప్రభావంతో జలగం నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ముంపునకు గురై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భవనం నీటిలో మునిగిపోవడంతో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని కలిసి స్కూల్‌ను సురక్షిత ప్రాంతానికి మార్చమని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి పాఠశాలను అరెంపులలోని మహమ్మదీయ కాలేజీ వద్దకు తరలించారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తక్షణ చర్యలు తీసుకోవడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, స్థానికుల మన్ననలు పొందింది. ఆ సందర్భంలో పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదల అవసరాన్ని కూడా గుర్తించారు. ఆ అవసరాన్ని తీర్చడానికి ముందుకు వచ్చినవారు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ తుమ్మల యుగంధర్.

తుమ్మల యువసేన ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

డాక్టర్ తుమ్మల యుగంధర్ వరదల కారణంగా నష్టపోయిన విద్యార్థుల కోసం తన సొంత ఖర్చుతో నోట్ బుక్స్ అందజేశారు. ఆయన ఆప్యాయతకు కృతజ్ఞతగా పాఠశాల యాజమాన్యం యుగంధర్ ని పాఠశాలకు ఆహ్వానించింది. శుక్రవారం ఆయన పాఠశాలకు వెళ్లి విద్యార్థులను స్వయంగా పలకరించారు. తుమ్మల యువసేన తరపున 250 స్కూల్ బ్యాగ్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఒక్కొక్కరితో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యా ప్రమాణాల పెంపుకు సూచనలు చేశారు. పాఠశాల వాతావరణంలో ఉత్సాహం నింపుతూ యుగంధర్ మాటలు పిల్లల్లో కొత్త ఆశను నింపాయి. సేవే ధర్మమని ఆయన ప్రవర్తనతో చూపించారు.

మాటల్లో కాదు, మానవత్వంలో మమకారం

పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన యుగంధర్ పిల్లలకు మానవత్వ పాఠం నేర్పారు. భోజన సమయంలో పిల్లలతో ముచ్చటిస్తూ వారి కలలను తెలుసుకున్నారు. "మీరు బాగా చదివి మంచి స్థాయిలో నిలవాలి" అని ప్రోత్సాహపరిచారు. ఆయన సాన్నిహిత్యం చూసి పిల్లలు ఆనందంతో కళకళలాడారు. ఉపాధ్యాయులు, యాజమాన్యం ఆయన వినమ్రతను ప్రశంసించారు. స్థానికులు కూడా ఆయన సానుభూతి దృష్టిని కొనియాడారు. పిల్లల భవిష్యత్తు కోసం అవసరమైన వసతులు కల్పిస్తామని యుగంధర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భం పాఠశాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందనే అభిప్రాయం వ్యక్తమైంది.

"చదువు మీకు ఆయుధం - భవిష్యత్తు మీ చేతుల్లోనే"

విద్యార్థులతో మాట్లాడుతూ యుగంధర్ "మీకు ఏం కావాలన్నా, నా సహాయం మీతో ఉంటుంది" అని భరోసా ఇచ్చారు. "పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గౌరవం తేవాలి" అని పిలుపునిచ్చారు. ఆయన మాటలు విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపాయి. "విద్యే మన జీవితానికి పునాది, మీరు చదువులో రాణించాలి" అని సూచించారు. పాఠశాల యాజమాన్యం ఆయన సహాయానికి కృతజ్ఞతలు తెలిపింది. స్థానిక ప్రజలు కూడా ఆయన సేవా దృక్పథాన్ని ప్రశంసించారు. యుగంధర్ సందర్శన విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని రేకెత్తించింది. పాఠశాల ఆనంద వాతావరణంలో మార్మోగింది.

# చెకుముకి సంబరాలు ప్రారంభం.!




విశ్వశాంతి లో విద్యార్థులకు బహుమతులు.



**సత్తుపల్లి, నవంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో "చెకుముకి సంబరాలు" పేరిట ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నవంబర్ 7న పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అనంతరం నవంబర్ 21న మండల స్థాయి, నవంబర్ 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 12 నుండి 14 వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నట్లు ఈ కార్యక్రమం జిల్లా కార్యదర్శి కంభంపాటి వెంకటేష్ తెలిపారు. విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడానికి, ప్రావీణ్యతను పెంచడానికి, వారిలోని సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి, సైన్స్ అధ్యయనాన్ని ప్రోత్సహించడానికి, అలాగే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నట్టు ఆయన వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు సుమారు 6 లక్షల మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో విశ్వశాంతి విద్యాలయంలో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆ పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు బహుమతులతో అభినందించారు.

# ఊరంతా నాటుకోడి పులుసే... ఎల్కతుర్తిలో రెండు వేల కోళ్లు వదిలివేత కలకలం





**ఎల్కతుర్తి. నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో నాటుకోళ్ల సంచలనం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు భారీ సంఖ్యలో — సుమారు రెండు వేల నాటుకోళ్లను — ఎల్కతుర్తి-సిద్దిపేట జాతీయ రహదారి సమీపంలోని మోడలింగ్ స్కూల్ వద్ద వదిలేసినట్లు స్థానికులు తెలిపారు. వరి పొలాలు, పత్తి చేన్ల వెంట కోళ్లు పరుగులు తీయడంతో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. వాటిని పట్టుకునేందుకు గ్రామస్థులు జాతర వాతావరణాన్ని తలపించేలా గుంపులు గుంపులుగా పరుగులు తీశారు. కొందరు ఒక్కటి రెండు కోళ్లు పట్టుకొని ఇంటికి బయలుదేరగా, మరికొందరు సంచుల్లో పదుల సంఖ్యలో వేసుకొని తీసుకెళ్లారు. దీంతో గ్రామంలో నేడు అనేక కుటుంబాల భోజన పట్టికపై "చికెన్ విందు" కనిపించనుందన్న ఉత్సాహం నెలకొంది.

అయితే ఈ కోళ్లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు వదిలారు? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోళ్లు ఎటువంటి వ్యాధితో బాధపడుతున్నాయా అన్న ఆందోళనల నేపథ్యంలో ఎల్కతుర్తి మండల పశు వైద్యాధికారి డాక్టర్ దీపిక కొన్ని నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు.

పోస్టుమార్టం నివేదిక ప్రకారం కోళ్లు ఆరోగ్యంగానే ఉన్నాయని, వాటిని తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని డాక్టర్ దీపిక తెలిపారు. ప్రజలు నిశ్చింతగా ఉండవచ్చని ఆమె భరోసా ఇచ్చారు. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు




**ఎల్కతుర్తి,నవంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడలిలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు గొర్రె మహేందర్ ప్రధాన అతిథిగా హాజరయ్యారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కార్యకర్తలు వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గొర్రె మహేందర్ మాట్లాడుతూ, “ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ఆరు గ్యారంటీల అమలు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలకు ఆశాకిరణంగా ఈ ప్రభుత్వం నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వసతులు, వైద్య సేవలు, రైతు మద్దతు, మహిళా ప్రోత్సాహం వంటి అంశాల్లో ప్రభుత్వం సమాన న్యాయం చేస్తోంది,” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండాల తిరుపతి, హుస్నాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఎర్రోళ్ల చైతన్య, మాజీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబాల స్వామి, శనిగరపు సాహూ, ఇంద్రనగర్ గ్రామ శాఖ అధ్యక్షులు అంబాల రమేష్, అంబాల జగన్, మంద సుమన్, రాజు యాదవ్, దేవకర్ కృష్ణ, బొంకూరి క్రాంతి, సాతూరి శ్రీకాంత్, కడారి శీను, గొర్రె కుమార్ రెడ్డి, బొంకూరి రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి



**పెద్దమందడి,నవంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామానికి చెందిన పెద్ద శ్రీనివాస్ రెడ్డి కుమారుడు మనోజ్ కుమార్ రెడ్డి - రమ్య ల వివాహం హైదరాబాద్‌లోని నారాపల్లి రుద్ర కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఘనంగా జరిగింది.

ఈ వివాహ వేడుకకు మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వధూవరులు సుఖ సంతోషాలతో దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు.

అలాగే వెల్టూర్ గ్రామానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ ప్రముఖులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఏఐపీసీ ఆధ్వర్యంలో ఓటర్ అవగాహన




**వనపర్తి,నవంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఏఐపిసి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఓటర్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమం కేబీఆర్ మసీదు సమీపంలో ఏఐపీసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి నాయకత్వంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు కీలకమని, ప్రజలు చురుకుగా ఎన్నికల్లో పాల్గొని ప్రగతిశీల పాలన కోసం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అజీజ్ ఇర్ఫాన్ జీ, లతీఫ్ జీ, సందీప్ భూషణ్ జీ, శశాంక్, అబ్దుల్లా బుఖారన్ తదితర ఏఐపీసీ నాయకులు పాల్గొని ప్రజల్లో ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

ప్రచారంలో భాగంగా ప్రజల్లో ఐక్యత, ప్రొఫెషనలిజం, మరియు ప్రజాకేంద్రీకృత రాజకీయాల సందేశాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఏఐపీసీ నాయకులు పేర్కొన్నారు.




# సరికొత్త చరిత్ర సృష్టించిన అభిషేక్..!




టీ20ల్లో వీరబాదుడుకు కేరాఫ్ అయిన అభిషేక్ శర్మ మరో రికార్డు నెలకొల్పాడు. ఆస్ట్రేలియా పర్యటనలో దంచికొడుతున్న అభిషేక్ పొట్టి క్రికెట్‌లో వెయ్యి పరుగుల మైలురాయిని అధిగమించాడు. తక్కువ ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సాధించిన రెండో భారత బ్యాటర్‌గా ఈ లెఫ్ట్ హ్యాండర్ రికార్డు సృష్టించాడు. టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. విరాట్ 27 ఇన్నింగ్స్‌ల్లో 1,000 రన్స్ పూర్తి చేసుకోగా.. అభిషేక్ 28 ఇన్నింగ్స్‌ల్లో ఈ మార్క్ చేరుకున్నాడు.పొట్టి క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న అభిషేక్ శర్మ పరుగుల ప్రవాహం కొనసాగుతోంది. ఐపీఎల్ విధ్వంసాన్ని అంతర్జాతీయ మ్యాచుల్లోనూ చూపిస్తున్న అభి.. ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 1,000 పరుగులు సాధించాడు. కోహ్లీ టాప్‌లో ఉండగా.. కేల్ రాహుల్ (29 ఇన్నింగ్స్‌లు), సూర్యకుమార్ యాదవ్(31 ఇన్నింగ్స్‌లు), రోహిత్ శర్మ(40 ఇన్నింగ్స్‌లు)లు టాప్ 5లో ఉన్నారు. బంతుల పరంగా చూస్తే అభిషేక్‌దే అగ్రస్థానం.ఈ డాషింగ్ బ్యాటర్ 528 బంతుల్లో వెయ్యి పరుగులు అందుకున్నాడు. సూర్యకుమార్ 573 బంతుల్లో, ఇంగ్లండ్ చిచ్చరపిడుగు ఫిల్ సాల్ట్ 599 బంతుల్లో ఈ ఫీట్ సాధించారు. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ 604 బంతుల్లో, ఆండ్రూ రస్సెల్ (వెస్టిండీస్), ఫిన్ అలెన్(న్యూజిలాండ్)లు 609 బంతుల్లో వెయ్యి క్లబ్‌లో చేరారు.

# వర్షంతో మ్యాచ్ రద్దు.. టీమిండియాకు సిరీస్ కప్!

**ఆసియా కప్ ఛాంపియన్ భారత జట్టు మరో పొట్టి సిరీస్ పట్టేసింది. ఆస్ట్రేలియాతో జరగాల్సిన చివరి టీ20 వర్షా ర్పణం కావడంతో 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది టీమిండియా. గబ్బాలో భారత ఇన్నింగ్స్ 4.5 ఓవర్ వద్ద అంతరాయం కలిగించిన వర్షం.. ఎంతకూ తగ్గకపోవడంతో అంపైర్లు చివరకు ఆటను రద్దు చేశారు. దాంతో.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు విజయాలు సాధించిన సూర్యకుమార్ యాదవ్ బృందం విజేతగా నిలిచింది**





# మరోసారి రిస్కీ షాట్.. - రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడిన పంత్..!

టీమిండియా టెస్టు స్పెషలిస్ట్ రిషభ్ పంత్ దక్షిణాఫ్రికా సిరీస్‌కు ముందే మరోసారి గాయపడ్డాడు. పాదం గాయం నుంచి కోలుకుని భారత ఏ జట్టు కెప్టెన్‌గా ఎంపికైన పంత్.. రెండో అనధికారిక టెస్టు ఇన్నింగ్స్‌లో రిస్కీ షాట్లతో మూల్యం చెల్లించుకున్నాడు. దక్షిణాఫ్రికా ఏ పేసర్లను ఎదుర్కొనే క్రమంలో పలుమార్లు బంతి తగిలించుకున్నాడీ హిట్టర్. సఫారీ పేసర్ సెపో మొరెకీ ఓవర్లో మూడుసార్లు పంత్ శరీరం, హెల్మెట్‌కు బంతి బలంగా తగిలడంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాల్సి వచ్చిందిమొదటి అనధికారిక టెస్టులో మెరుపు అర్ధ శతకంతో ఫామ్ చాటుకున్న పంత్.. రెండో మ్యాచ్‌లోనూ దంచేయాలనుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ కేఎల్ రాహుల్(27) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన పంత్ తనదైన స్టయిల్లో దూకుడుగా ఆడాడు. తొలి మూడు బంతులను 4, 4 ,6 గా మలిచిన పంత్‌ను కట్టడి చేసేందుకు సఫారీ పేసర్లు షార్ట్ పిచ్ బంతులు సంధించారు. దాంతో.. పంత్ కాస్త నెమ్మదించాడుఅయితే.. సెపో మొరెకీ వేసిన 34వ ఓవర్లో బంతి మూడు సార్లు శరీరం, హెల్మెట్‌కు తగలడంతో నొప్పిని భరిస్తూనే పంత్ ఆట కొనసాగించాడు. కానీ, అతడు మరోసారి తీవ్రంగా గాయపడకుండా చూడాలనే ఉద్దేశంతో కోచ్ హ్రిషికేశ్ కనికర్, ఫిజియోలు వెనక్కి పిలిచారు. దాంతో.. రిటైర్డ్ హర్ట్‌గా పంత్ మైదానం వీడాడు. అప్పటికి ఈ డాషింగ్ బ్యాటర్ 22 బంతుల్లో 17 పరుగులు చేశాడు.

**సిక్సర్‌తో హాఫ్ సెంచరీ**

డ్రెస్సింగ్ రూమ్‌లో కాసేపు విశ్రాంతి తీసుకున్న పంత్.. రాహుల్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చాడు. సెంచరీ వీరుడు ధ్రువ్ జురెల్ (127 నాటౌట్)తో కలిసి ఆధిక్యాన్ని నాలుగొందలు దాటించాడు. సిక్సర్‌తో హాఫ్ సెంచరీ సాధించిన అతడు.. సిమండ్స్ ఓవర్లో పెద్ద షాట్ ఆడబోయాడు. కానీ, టైమింగ్ కుదరక వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. ఆ వెంటనే భారత ఏ జట్టు 3827 వద్ద రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది రెల్ అజేయ శతకం.. పంత్ మెరుపు అర్ధ శతకంతో ప్రత్యర్థి ముందు 417 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది టీమిండియా. తొలి ఇన్నింగ్స్‌లో 119 కేఆ ఆరు వికెట్లు పడిన వేళ వీరోచిత శతకం(132 నాటౌట్)తో జట్టును ఆదుకున్న జురెల్ ___ రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీతో చెలరేగి భారీ ఆధిక్యాన్ని అందించాడు

# జస్ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించబోతున్నాడు..!




భారత జట్టు అగ్రశ్రేణి వేగవంతుడు జస్ప్రీత్ బుమ్రా మరో ఘనత దిశగా పయనిస్తున్నాడు. ఇప్పటివరకు ఏ భారత బౌలర్ సాధించని రికార్డును బుమ్రా రాబోయే మ్యాచ్‌లో అందుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం బుమ్రా టెస్ట్, వన్డే, టీ20 మూడు ఫార్మాట్లలో కలిపి 299 వికెట్లు తీసుకున్నాడు. ఇక ఒక వికెట్ తీస్తే అన్ని ఫార్మాట్లలో 300 వికెట్లు పూర్తి చేసిన తొలి భారత బౌలర్‌గా చరిత్రలో నిలిచిపోతాడు. బుమ్రా తన వేగం, లైన్‌లెంగ్త్, అద్భుత యార్కర్లతో ప్రపంచ క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రతి ఫార్మాట్‌లోనూ భారత బౌలింగ్ దళానికి బుమ్రానే ఆధారం. టెస్టులలో 150కు పైగా, వన్డేల్లో 130కు పైగా, టీ20ల్లో 70కు పైగా వికెట్లు సాధించాడు. భారత క్రికెట్ చరిత్రలో ఈ ఘనతను చేరువలో ఉంచుకున్న బుమ్రా, రాబోయే మ్యాచ్‌లో ఒక వికెట్ తీస్తే చరిత్ర సృష్టించనుండటం అభిమానులను ఉత్సాహపరుస్తోంది.

# క్రెడిట్ కార్డు యూజర్లకు గమనిక..

తమ బ్యాంకు అకౌంట్‌లో జీతం పడే ఉద్యోగులకు.. ఆర్థికంగా కాస్త తోడు ఉండేందుకు, వారికి సహాయంగా ఉంటూనే ఆదాయాన్ని పొందేందుకు బ్యాంకులు క్రెడిట్ కార్డును అందజేస్తుంది. క్రెడిట్ కార్డుతో ముందుగానే కొంత డబ్బును ఇచ్చి, ఆ డబ్బును వాడుకోవడానికి వీలు కల్పిస్తాయి. దీంతో ఉద్యోగి, క్రెడిట్ కార్డుతో తమ ఆర్థిక అవసరాలను తీర్చుకుంటాడు. తనకు వచ్చిన కార్డు లిమిట్‌లో డబ్బును ఆర్థిక అవసరాలకు ఉపయోగిస్తూ నెల రోజుల సమయంలో ఈఎమ్ఐ ఆప్షన్ తో డబ్బును చెల్లించే అవకాశం ఉంటుంది. దీంతో యూజర్, తమకు నచ్చినంత డబ్బును అవసరానికి ఉపయోగించుకుంటాడు. అయితే క్రెడిట్ కార్డుతో లాభంతోపాటు నష్టాలు కూడా చాలానే ఉన్నాయి. తీసుకున్న డబ్బును సమాయానికి చెల్లించకపోతే భారీగా వడ్డీతో పాటు బ్యాంక్ మనీ రికవరీ ఏజెంటులు ఒత్తిడి చేస్తారు. సమయానికి డబ్బులు చెల్లిస్తే.. మంచి క్రెడిట్ స్కోరు ఉంటుంది. దీంతో తదుపరి ఏదైనా లోన్ తీసుకోవాలనుకుంటే ఇది చాలా ఉపయోగపడుతుంది. అయితే సరైన సమయానికి క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించేవారి డబ్బుల పరిమితిని బ్యాంకులు పెంచుతూ ఉంటాయి. బాధ్యతాయుతంగా ఉన్న కార్డు యూజర్‌కు బ్యాంక్ ఆఫర్ చేసే లిమిట్ పెంచుకోవాలా? తిరస్కరించాలా? అనేది కార్డుదారుని నిర్ణయంపై ఆధారపడి ఉంటుందిఅయితే క్రెడిట్ కార్డుతో లాభంతోపాటు నష్టాలు కూడా చాలానే ఉన్నాయి. తీసుకున్న డబ్బును సమాయానికి చెల్లించకపోతే భారీగా వడ్డీతో పాటు బ్యాంక్ మనీ రికవరీ ఏజెంటులు ఒత్తిడి చేస్తారు. సమయానికి డబ్బులు చెల్లిస్తే.. మంచి క్రెడిట్ స్కోరు ఉంటుంది. దీంతో తదుపరి ఏదైనా లోన్ తీసుకోవాలనుకుంటే ఇది చాలా ఉపయోగపడుతుంది. అయితే సరైన సమయానికి క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించేవారి డబ్బుల పరిమితిని బ్యాంకులు పెంచుతూ ఉంటాయి. బాధ్యతాయుతంగా ఉన్న కార్డు యూజర్‌కు బ్యాంక్ ఆఫర్ చేసే లిమిట్ పెంచుకోవాలా? తిరస్కరించాలా? అనేది కార్డుదారుని నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.క్రెడిట్ స్కోర్ వాడేవారి పర్ఫార్మెన్స్ క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో ద్వారా వెల్లడవుతుంది. యూజర్ కు ఇచ్చిన కార్డు లిమిట్ లో ఎంత శాతం క్రెడిట్‌ను వాడుకున్నామో దాన్నే సీయూఆర్ అంటారు. ఇది 30 శాతం ఉండేలా చూసుకోవాలని నిపుణులు తెలుపుతున్నారు. ఉదాహరణకు మీ కార్డు లిమిట్ రూ.లక్ష ఉన్నట్లయితే నెలకు రూ.30 వేలు లావాదేవీలు చేస్తే యుటిలైజేషన్ రేషియో 30 శాతం ఉంటుంది. ఒకవేళ మీ బ్యాంకు ఆ లిమిట్‌ను రూ.2 లక్షలకు పెంచితే.. మీరు అదే రూ.30 వేలు వాడినట్లయితే సీయూఆర్ 15 శాతం అవుతుంది. అంటే 15 శాతం తగ్గుతుంది. ఇలా తక్కువగా వాడటం వలన మంచి క్రెడిట్ స్కోరు ఉంటుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వృద్ధాశ్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నాగారం, నవంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి చౌరస్తాలో ఆదర్శ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ వృద్ధాప్య ఆశ్రమంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేత రాజు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, దమ్మైగూడ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప రామారావు పాల్గొన్నారు.వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి, వారికి భోజన విందు ఏర్పాటు చేశారు.వృద్ధులతో మమేకమై నాయకులు ఆత్మీయంగా మాట్లాడి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీర్ఘాయుష్మాన్‌భవ అనే ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ టీజేఎస్ పార్టీ అధ్యక్షులు చిట్యాల శ్రీనివాస్ రెడ్డి, దమ్మైగూడ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ సంజీవరెడ్డి, బాల్ రెడ్డి, గోవింద్ సింగ్, మాదిరెడ్డి రాజిరెడ్డి, దిలీప్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 48 గంటల్లో గన్ని సంచుల సరఫరా..



అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం బ్యూరో, నవంబర్ -8, తెలంగాణ ముచ్చట్లు;** ధాన్యం కొనుగోలుకు అవసరమైన మేర గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, ప్రతిపాదనలు పంపిన 48 గంటల లోపు కొనుగోలు కేంద్రాలకు గన్ని సంచులు సరఫరా చేస్తున్నామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025 ధాన్యం కొనుగోలుకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టడం జరిగిందని అన్నారు. ధాన్యం కొనుగోలు అవసరాలకు మాత్రమే గన్ని సంచులు అందించడం జరుగుతుందని, రైతుల ఇంటి వద్దకు గన్ని సంచులు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు 9 లక్షల 71 వేల 500 గన్ని సంచులు పంపిణీ చేశామని అన్నారు. గన్ని సంచుల కోసం కొనుగోలు కేంద్రాలు ఇండెంట్ పెట్టిన 48 గంటల లోగా సరఫరా చేస్తున్నామని, గన్ని సంచులకు జిల్లాలో ఎక్కడా కొరత లేదని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# బ్యాంకుల్లో నగదు విత్‌డ్రా ఎన్నిసార్లు తీయవచ్చు?

ప్రస్తుత సాంకేతిక యుగంలో డిజిటల్ చెల్లింపులో జోరుగా సాగుతున్నాయి. టీ దుకాణాల నుంచి బడా షాపింగ్ మాల్స్ వరకు యూపీఐ పేమెంట్స్ జరుగుతున్నాయి. యూపీఐ లావాదేవీలు జీవితంలో భాగంగా మారాయి. యూపీఐ చెల్లింపులకు ఎలాంటి ఫీజులు లేకపోవడంతో జోరుగా సాగుతున్నాయి. ఈ యూపీఐ లావాదేవీలు రోజువారీ జీవితాన్ని సులభతరం చేశాయి. దాంతో డబ్బును వేగంగా పంపడంతో పాటు తీసుకుకోవడం సాధ్యమవుతున్నది. అయినా, నేటికీ పలు నగరాలు, పట్టణాల్లో జనం ఇంకా ఆన్లైన్ చెల్లింపుల కంటే నగదు చెల్లింపులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు అవసరమైతే నగదును తీసుకునేందుకు బ్యాంకులు, ఏటీఎంలను ఆశ్రయిస్తుంటారు. అయితే, నగదు అవసరమైతే నెలకు ఎన్నిసార్లు తమ బ్యాంకు ఖాతా నుంచి డబ్బును విత్డ్రా చేసుకునేందుకు ఏమైనా పరిమితులు ఉన్నాయా? అనే అనుమానాలు కలుగుతుంటాయి.వాస్తవానికి ప్రతీ బ్యాంకుకు దాని సొంత పరిమితులను నిర్దేశిస్తుంటాయి. బ్యాంకులు కొన్ని లావాదేవీలు ఉచితంగా అందిస్తాయి. ఆ తర్వాత ప్రతి విత్డ్రాకు ఛార్జీలు విస్తాయి. ఎస్బీఐ, పీఎన్బీ, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాతా ఉంటే.. సాధారణంగా మూడు నుంచి ఐదుసార్లు ఉచితంగా విత్డ్రా చేసుకోవచ్చు. అనంతరం ప్రతి లావాదేవీకి రూ.10 నుంచి రూ.20 వరకు ఛార్జీలు విధిస్తారు. ఈ పరిమితి ఏటీఎంలకు సైతం వర్తిస్తుంది. హెచ్డీఎఫ్సీ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి ప్రైవేటు బ్యాంకులు తమ కస్టమర్లకు ఐదుసార్లు ఉచిత నగదు ఉపసంహరణకు అవకాశం ఇస్తుంది. అయితే, మీరు మీ బ్యాంకు ఏటీఎం నుంచి నగదును విత్డ్రా చేసుకుంటే ఈ పరిమితి దాటిన తర్వాత ఛార్జీలు ఎక్కువగా విధిస్తాయి.ఒక్కో బ్యాంకు ఒక్కో విధంగా చార్జీ విధిస్తుంటాయి. నగరం, పట్టణాన్ని బట్టి ఈ రూల్స్ మారుతూ వస్తుంటాయి. మెట్రోపాలిటన్ ప్రాంతాల్లోని ఏటీఎంల లావాదేవీ పరిమితులు తక్కువగా ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో, బ్యాంకులు కస్టమర్లకు మరింత సౌలభ్యాన్ని అందిస్తాయి. కాబట్టి వారు నగదు తీసుకునే ప్రతిసారీ పట్టణానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఇది గ్రామీణ వినియోగదారులకు సౌలభ్యాన్ని అందిస్తుంది. నగదు ఉపసంహరణ పరిమితులు ఏటీఎంలకు మాత్రమే కాకుండా బ్యాంకు శాఖలకు వర్తిస్తాయి. కొన్ని బ్యాంకులు నెలకు మూడు ఉచిత కౌంటర్ ఉపసంహరణలను అనుమతి ఇస్తున్నాయి.



# సామినేని రామారావు హంతకులను పట్టుకోవడంలో పోలీసుల వైఫల్యం..

- సిపిఎం నేతలుధ్వజం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇందుకు భాధ్యత వహించేల్సిందే
- రామారావు ను చంపినంత మాత్రాన ఎర్రజెండా లేకుండా చేస్తామనేది వాళ్ళ భ్రమ
- వాళ్ళు కుక్క చావు చవక తప్పదు.. ప్రజలు వారిని సోషల్ బాయ్ కట్ చేయాలి
- ప్రపంచం అంతా ఎర్రజెండా వైపు చూస్తుంది

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 8, తెలంగాణ ముచ్చట్లు;** సిపిఎం సీనియర్ నేత చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సామినేని రామారావును చంపిన హంతకులను పట్టుకోవడంలో పోలీసులు వైఫల్యం ఉందని సిపిఎం నేతలు ధ్వజమెత్తారు. సామినేని రామారావు సంతాపసభ శనివారం పాతర్లపాడు గ్రామంలో జరిగింది. ఈ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఎం ఆంధ్ర ప్రదేశ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, తదితరులు కాంగ్రెస్ పార్టీ వారే తమ నేతను హత్య చేశారని ఆరోపణలు చేశారు. రామారావుది రాజకీయ హత్య కాదంటున్న పోలీస్ కమిషనర్ మరి హంతకులు ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు ఆయన రాజకీయ నాయకుడిలా మాట్లాడుతున్నాడు, కాంగ్రెస్ అంటే ప్రేమ ఉంటె కాకి చొక్కాలు వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరాలని హితవు పలికారు ..చనిపోయిన రామారావు భార్య స్వయంగా పోలీసులకు ఫలానా, ఫలానా వాళ్ళు తన భర్త హత్యకు కారణమని లిఖితపూర్వకంగా రాసి ఇస్తే వాటి మీద చర్యలు తీసుకోకుండా ఆమెను కుటుంబసభ్యులను వేధిస్తున్నారని ఇదెక్కడి న్యాయం భాదితులకు అండగా ఉండాల్సిన పోలీసులు కాంగ్రెస్ కు వత్తాసు పలకడం ఏమిటని నిలదీశారు . అవసరమైతే పోలీసుల తీరుపై ప్రవేటు కంప్లైంట్ వేస్తామని రామారావు కుమారుడు విజయ్ సభముఖంగా పోలీసులకు హెచ్చరికలు చేశారు . సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు మాట్లాడుతూ,ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యే ,ఇక్కడ రామారావు ఉండగా తమ ఆటలు సాగవని భావించిన ప్రత్యర్థులు ఆయన్ను అడ్డు తొలగించుకునేందుకు దారుణం గా హత్య చేశారని అన్నారు. కొంతమంది ఆగంతకులు గొంతు కోసి చంపడం అదికూడా తెల్లవారుతుండగా చంపాడమంటే అత్యంత ప్రణాళిక ప్రకారం జరిపారని అన్నారు..ఈ హత్యను పొలిట్ బ్యూరో కూడా ఖండించింది తెలిపారు .. మృదు స్వభావి శత్రువుతో సహితం మర్యాదగా మాట్లాడే రామారావు దుర్మార్గంగా పొట్టన పెట్టుకున్న దుండగులను పట్టుకోవడంలో పోలీసుల వైఫల్యంపై విమర్శలు చేశారు..ప్రత్యర్థులు ఏ రాజకీయ కక్షతో హత్య చేశారో, అదే రాజకీయ కక్షతో దెబ్బ కొట్టాలని రాఘవులు పిలుపు నిచ్చారు ..రాష్ట్రంలో హోమ్ శాఖ కూడా సీఎం రేవంత్ రెడ్డి వద్దనే ఉందని, ఇక భట్టి డిప్యూటీ సీఎం గా ఉన్నారని ఇదే జిల్లాకు చెందిన పొంగులేటి కోటరీలో సభ్యుడుగా ఉన్నారని ధ్వజమెత్తారు హత్య జరిగి 9 రోజులు గడుస్తున్నా చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వమా ఇది అని ఆగ్రహం వ్యక్తం చేశారు .. భట్టి విక్రమార్క అదే రోజు హత్యను ఖండిస్తూ ప్రకటన చేశారు హంతకులను పెట్టుకోకుండా ప్రకటనలు చేస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు.. ప్రజల కోసం పనిచేసే వాళ్ళు కమ్యూనిస్టులు అయితే ..దోచుకునే వాళ్ళు కాంగ్రెస్ వాళ్ళు అని మనం వాళ్ళను ప్రజల్లోనే ఎండగట్టాలని అన్నారు.. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవి కుమార్,పాలడుగు భాస్కర్, సిపిఎం ఖమ్మం ,కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు నున్న నాగేశ్వరావు, మచ్చా వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిజమ్ముల జితేందర్ రెడ్డి ,న్యూడెమోక్రసీ నాయకులు మధు సిపిఎం నాయకులు, పి.సోమయ్య, బుగ్గవీటి సరళ, రామారావు సతీమణి సామ్రాజ్యం ,కూతురు, కోడలు, సిపిఎం జిల్లా నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, విక్రమ్, కనకయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు సభకు సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మదుపల్లి గోపాల్ రావు అధ్యక్షత వహించారు



# RBI 35 టన్నుల బంగారం విక్రయం.. వాస్తవేమిటి?

భారత ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డాలర్లు విక్రయిస్తుందన్న వార్తలు వచ్చాయి.డాలర్లతో పాటు ఏకంగా 35 టన్నుల బంగారం విక్రయించిందనే వార్తలూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ వార్తలపై రిజర్వ్ బ్యాంక్ తాజాగా క్లారటీ ఇచ్చింది. పసిడి విక్రయించిందన్న క్లెయిమ్స్ కొట్టి పారేసింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం.ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో మన దేశ కరెన్సీ రూపాయి విలువ భారీగా పడిపోతోంది. జీవన కాల కనిష్ఠాల వద్ద ట్రేడవుతోంది. దీంతో రూపాయికి మద్దతుగా దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ చర్యలు చేపడుతోంది. అయితే, ఈ క్రమంలోనే బంగారం విక్రయం వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ తన నిల్వల నుంచి 35 టన్నుల బంగారం (35000 కిలోల పసిడి) విక్రయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని తాజాగా కేంద్ర ప్రభుత్వం ఖండించింది. బంగారం విక్రయంపై వచ్చిన పలు వార్తా కథనాలు, సోషల్ మీడియా పోస్టులు అవాస్తవమని స్పష్టం చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారీగా బంగారం విక్రయించిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం సైతం వెల్లడించింది. ఎలాంటి ధ్రువీకరణ లేకుండా ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని తెలిపింది. ఎవరికీ ఇలాంటి తప్పుడు వార్తలను ఫార్వర్డ్ చేయెుద్దని విజ్ఞప్తి చేసింది. ఆర్థిక పరమైన ప్రకటనలు, నిర్ణయాల వంటి సమాచారాన్ని రిజర్వ్ బ్యాంక్ తన అధికారిక వెబ్‌సైట్లో ధ్రువీకరించుకోవాలని సూచించింది. మరోవైపు.. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేసింది. దానిని రిజర్వ్ బ్యాంక్ రీపోస్ట్ చేస్తూ సోషల్ మీడియాలో ఆధారాలు లేని ప్రచారాల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరింది. ఏ సమాచారం కోసమైనా దయచేసి తమ అధికారిక వెబ్‌సైట్లోకి వెళ్లాలని విజ్ఞప్తి చేసింది.అంతర్జాతీయంగా ప్రస్తుతం అనిశ్చిత పరిస్థితులు ఉన్నాయి. వివిధ దేశాల మధ్య యుద్ధాలు, ద్రవ్యోల్బణం భయాలతో బంగారానికి డిమాండ్ భారీగా పెరుగుతోంది. ఇందుకు కేంద్ర బ్యాంకులు సైతం ఓ కారణంగా చెప్పవచ్చు. ఎందుకంటే భారీగా బంగారం నిల్వలు పెంచుకుంటున్నాయి. 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు చూసుకుంటే వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు ఏకంగా 200 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు ప్రపంచ స్వర్ణ మండలి గణాంకాలు చెబుతున్నాయి. సెప్టెంబర్ నెలలోనే 39 టన్నుల బంగారాన్ని వివిధ కేంద్ర బ్యాంకులు కొనుగోలు చేసిటన్లు డబ్ల్యూజీసీ తెలిపింది. ఒక్క ఉజ్బెకిస్థాన్ మాత్రమే 4 టన్నుల బంగారాన్ని విక్రయించింది.

# కాసులు కురిపించిన ఐపీఓలు..!

స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే వారికి ఐపీఓ గురించి తెలిసే ఉంటుంది. ఇక్కడ కంపెనీలు నిధుల్ని సేకరించేందుకు.. తమ షేర్లను పబ్లిక్‌లోకి తీసుకొస్తాయి. ఇక్కడ మెయిన్ బోర్డు ఐపీఓలు ఉంటాయి. ఎస్ఎంఈ ఐపీఓలు ఉంటాయి. ఈ ఏడాదిలో ఇన్వెస్టర్లకు కాసుల పండించిన ఈ ఐపీఓల గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం. ఇక్కడ కొన్ని ఇన్వెస్టర్ల సంపదను రెట్టింపు చేశాయి. మరికొన్ని ఏకంగా మూడింతల లాభం కూడా అందించాయి.మీరు పెట్టుబడుల కోసం స్టాక్ మార్కెట్‌ను ఎంచుకుంటే.. కచ్చితంగా రిస్క్ ఫ్యాక్టర్‌ను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకొని ఉంటాయని చెప్పొచ్చు. అందుకే నిపుణుల సలహా తీసుకోవాలి. ఆయా కంపెనీల గురించి పూర్తిగా విశ్లేషించి.. సరైన సమయంలో సరైన దాన్ని ఎంచుకొని పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇక వీటిల్లో ఐపీఓ (ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్) గురించి స్పెషల్‌గా చెప్పనక్కర్లేదు. ఇక్కడ ఆయా కంపెనీలు తమ వ్యాపార విస్తరణ లేదా ఇతర ఆర్థిక అవసరాల కోసం స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అయ్యేందుకు ప్రజల నుంచి మూలధనాన్ని సేకరిస్తుంటాయి. అయితే.. మెయిన్ బోర్డు ఐపీఓల విషయానికి వస్తే.. ఇవి నేరుగా బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి , నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి వంటి వాటిల్లో లిస్టవుతుంటాయి.ఇదే సమయంలో ఎస్ఎంఈ ఐపీఓలు (స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) కంపెనీలు మాత్రం ఐపీఓకు వస్తే.. ఇవి వంటి ప్రత్యేకమైన ఎస్ఎంఈ ప్లాట్‌ఫారంలలో లిస్ట్ చేస్తాయి. ఇవి మరింత రిస్క్‌తో కూడుకున్నవని నిపుణులు చెబుతుంటారు. అయినప్పటికీ ఇవి ఇతర ఐపీఓల కంటే చాలా ఎక్కువగా లిస్టింగ్ రిటర్న్స్ అందిస్తుంటాయి. ఇక్కడ పెట్టుబడి కూడా కాస్త ఎక్కువగా ఉంటుందని చెప్పొచ్చు. ఈ క్రమంలోనే.. ఈ ఏడాదిలో అత్యధికంగా రిటర్న్స్ అందించినటువంటి ఎస్ఎంఈ ఐపీఓల గురించి ఇప్పుడు చూద్దాం. ఇక్కడ డబుల్, ట్రిపుల్ రిటర్న్స్ కూడా వచ్చాయి. ఎలక్ట్రిక్ వెహికిల్ మాన్యుఫ్యాక్చరర్ జీలియో ఇ మొబిలిటీ స్టాక్ ఈ సంవత్సరంలో 170 శాతం రాబడి అందించింది. పెట్టుబడిపై 1.7 రెట్ల మేర లాభం వచ్చిందన్నమాట. ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫర్మ్ సోధాని క్యాపిటల్ ఐపీఓ ధర 125 శాతం పెరిగింది. ఇక్కడ పెట్టుబడిపై 1.25 రెట్ల లాభం వచ్చింది. టెక్‌డీ సైబర్ సెక్యూరిటీ ఐపీఓ రికార్డు స్థాయిలో 336 శాతం పెరిగింది. ఇక్కడ మూడింతలకుపైగా లాభం వచ్చిందన్నమాట.ఎయిర్‌ఫ్లోవా రైల్ టెక్నాలజీ ఎస్ఎంఈ ఐపీఓ 2025లో 163 శాతం పుంజుకుంది. అనోందితా మెడికేర్ విషయానికి వస్తే ఇది 313 శాతం పెరిగి 3 రెట్లకుపైగా ప్రాఫిట్స్ అందించింది. ఇది హెల్త్ కేర్ విభాగానికి చెందినది. ఏవియేషన్ సర్వీసెస్ స్పేస్ కార్యకలాపాలు నిర్వర్తించే ఫ్లై ఏవియేషన్ స్టాక్ 136 శాతం పుంజుకుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# మామిడిపండు తినకపోవడం వల్ల ఇన్ని నష్టాలా..!

వేసవికాలం వచ్చిందంటే చాలు ఎక్కువగా మామిడి పండ్లు వంటివి తినడానికే మక్కువ చూపుతూ ఉంటారు ప్రజలు.. అందుకే వీటిని పండ్లలో రారాజుగా పిలుస్తూ ఉంటారు. తినడానికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం మామిడి పండ్లు అందిస్తాయి పచ్చిగా ఉన్న మాగిన కూడా ఈ మామిడి పండ్లు ఎంతో ఉపయోగపడతాయి. మామిడికాయలను పచ్చళ్ళు పప్పు, కూరలుగా కూడా చేసుకుంటూ ఉంటారు. చాలామంది పండిన మామిడికాయలను తినడానికి ఇష్టపడుతూ ఉంటారు. అయితే నిపుణులు తెలుపుతున్న ప్రకారం మాగిన మామిడిపండు కంటే పచ్చికాయలను తినడమే మంచిదని తెలియజేస్తున్నారు. మామిడి పండులో విటమిన్ సి.. పుష్కలంగా లభిస్తుంది. ముఖ్యంగా ఇందులో ఉండే పొటాషియం, మెగ్నీషియం, విటమి%జు% ,కాపర్ ,ఫోలేట్ వంటివి పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని సైతం పెంచడానికి సహాయపడతాయి.. అలాగే ఫైబర్ కంటెంట్ కూడా ఎక్కువగా ఉండడం వల్ల విరోచనాలు, మలబద్ధక సమస్యలను కూడా తగ్గిస్తాయట. అప్పుడప్పుడు మామిడి పండ్లను తినడం వల్ల గుండె పనితీరును కూడా మెరుగుపరిచేలా చేస్తుంది. వీటి వల్ల గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుందట. వేసవికాలంలో పండిన మామిడిపండు పచ్చిగా తినడమే మంచిది. ముఖ్యంగా గర్భవతులు పచ్చి మామిడిపండ్లు అంటే చాలా ఇష్టంగా తింటూ ఉంటారు. ఎందుకంటే ఇది వాంతులు వికారం అరికట్టడంలో చాలా ఉపయోగపడతాయి.. వేసవికాలంలో ఎదురయ్యే వడదెబ్బ భయానికి కూడా పచ్చి మామిడిపండ్లు చాలా ఉపయోగపడుతుంది. మన శరీరంలో వేడిని సైతం తగ్గించడానికి పచ్చి మామిడిపండ్లు తినడం మంచిది. మామిడి పండుని డైరెక్ట్ గా తినకుండా కాస్త ఉప్పు కారంపొడి చల్లుకొని తినడం వల్ల మరింత టేస్ట్ గా అనిపిస్తుంది. శరీరంలో ఉండే ఐరన్, సోడియం, క్లోరైడ్ వంటి ఖనిజాలను సైతం వృధా కాకుండా మామిడిపండు అరికడుతుంది. ఎవరైనా నీరసంతో ఉండేవారు వారంలో ఒక్కసారైనా మామిడిపండును తినడం వల్ల వాటి నుంచి బయటపడవచ్చు. మాగిన మామిడి పండు కంటే పచ్చి మామిడిపండుకి ఎక్కువ ప్రయోజనాలు కలిగి ఉన్నాయి.

# సపోటానా అని తీసిపారేకండి..

ఎండలు దంచి కొడుతున్నాయి. బయట అడుగు పెట్టాలంటేనే వణుకు పుడుతోంది. ఒకవేళ అత్యవసరమైన పని ఉండి వెళ్తే.. గొంతు తడారి పోతోంది. ఇలాంటి సమయంలో ఎంత నీరు తాగినా ఉపయోగం ఉండదు. పైగా ఒంట్లో శక్తి కూడా తగ్గిపోతుంది. అలాంటప్పుడు శరీరానికి సత్వర శక్తి అవసరం. అన్నింటికీ మించి విటమిన్స్, మెండుగా కావాలి. అవన్నీ దండిగా లభించే పండు ఒకటుంది. దాని పేరే సపోటా. ఆఫ్రికన్ దేశాల నుంచి కొన్ని వందల సంవత్సరాల క్రితమే మన దేశంలోకి ప్రవేశించిన ఈ పండు కేవలం వేసవికాలంలోనే లభ్యమవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ పండ్ల తోటలు విస్తారంగా సాగవుతున్నాయి. వేసవికాలంలో ఈ పండును తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఈ కథనంలో తెలుసుకుందామా.. సపోటా రుచికి చాలా



తీపిగా ఉంటుంది. ఇందులో ఉన్న గుజ్జులో అనేక పోషకాలు ఉంటాయి.. ఫైబర్, విటమిన్ కే, పొటాషియం, కాల్షియం, కాపర్, మెగ్నీషియం, జింక్, ఫాస్పరస్, విటమిన్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. సపోటాలో కాల్షియం, ఫాస్పరస్ దండిగా ఉంటాయి కాబట్టి.. ఇవి శరీరంలో ఎముకల దృఢత్వానికి సహకరిస్తాయి. ముఖ్యంగా ఆస్టియో పోరోసిస్ అనే వ్యాధి నుంచి దూరం చేస్తాయి. ఇందులో ఉండే విటమిన్ సి, కాపర్ రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. వివిధ కాలాల్లో తలెత్తే వ్యాధుల నుంచి శరీరాన్ని కాపాడతాయి. సపోటాలో మెగ్నీషియం, పొటాషియం రక్త ప్రసరణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. రక్తపోటును క్రమబద్ధీకరిస్తాయి. రక్తనాళాల్లో పేరుకుపోయిన కొవ్వును కరిగిస్తాయి. సపోటాలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు నోరు, ఊపిరితిత్తులు, పెద్దపెగు క్యాన్సర్లను నిరోధిస్తాయి. ఈ పండులో అధికంగా క్యాలరీలు ఉంటాయి. ఇవి శరీరానికి సత్వర శక్తినిస్తాయి. జీర్ణ క్రియను పెంపొందిస్తాయి. ఈ పండులో విటమిన్ ఏ అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. నేత్ర సంబంధిత వ్యాధులు దరి చేరకుండా కాపాడుతుంది. ఇందులో ఉండే ''విటమిన్ ఈ'' చర్మంలో తేమశాతం పడిపోకుండా కాపాడుతుంది. ముఖ్యంగా చర్మానికి సంబంధించి వచ్చే ఫ్రీ రాడికల్స్ వంటి వాటిని దూరం చేస్తుంది. యాంటీ ఏజింగ్ కాంపౌండిరగ్ గా పనిచేస్తుంది.

# రక్తదానం చేస్తే ఏం జరుగుతుంది?

మనం ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలో తగినంత బ్లడ్ లెవల్స్ ఉండాలి. వివిధ వ్యాధుల బారినుంచి మనల్ని మనం కాపాడుకోవడంలోనూ రక్తం కీలపాత్ర పోషిస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడటం, రక్తహీనత ఏర్పడటం వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేది బ్లడ్ మాత్రమే. అందుకే రక్త దానం ప్రాణ దానంతో సమానమని అంటుంటారు నిపుణులు. అయితే రక్తం ఎవరికి అవసరం? బ్లడ్ డొనేషన్ వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి? ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం పడుతుంది తదితర విషయాలు తెలుసుకుందాం. ప్రతీ సంవత్సరం మనదేశంలో సుమారు 4 లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. 25 శాతం మంది పురుషులు, 57 శాతం మంది మహిళలు, 67 శాతం మంది పిల్లలు, 52 శాతం మంది గర్భవతులు రక్తహీనతతో బాధపడున్నారు. దాదాపు లక్షన్నర మంది



ప్రమాదాల్లో గాయపడి చనిపోతున్నారు. గాయపడినప్పుడు అధిక రక్త స్రావం కావడంవల్లే ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి పోవాలంటే వ్యక్తులుగా మనం నిర్వర్తించాల్సిన బాధ్యలు కూడా ఉన్నాయంటున్నారు నిపుణులు. అలాంటి వాటిలో ముఖ్యమైంది రక్త దానం చేయడం. కొందరు తమ శరీరం బలహీన పడుతుందని బ్లడ్ డొనేట్ చేయడానికి వెనుకాడుతుంటారు. కానీ ఇది కేవలం అపోహ మాత్రమే. బ్లడ్ డొనేషన్ వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. బ్లడ్ డొనేషన్ వల్ల ఎటువంటి నష్టమూ ఉండదు. రక్తం ఇచ్చినవారి శరీరం బలహీన పడుతుందనేది కేవలం ఒక అపోహ మాత్రమే. పైగా రక్త దానం చేయడంవల్ల పాత రక్తకణాలు పోయి, కొత్త రక్తకణాలు ఏర్పడతాయి. దీని వల్ల శరీరంలో సహజంగానే కొత్త రక్తం ప్రొడ్యూస్ అవుతుంది. బాడీలో ఐరన్ లెవల్స్ అధికమైతే రక్తనాళాల్లో ఆటంకానికి దారి తీయవచ్చు. ఇతర అనారోగ్యాలు కూడా ఏర్పడవచ్చు. అయితే రక్త దానం చేసేవారిలో ఈ సమస్య ఉండదు. పైగా ఐరన్ లెవల్స్ కంట్రోల్లో ఉంటాయని, గుండెపోటు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని నిపుణులు చెప్తున్నారు. బ్లడ్ డొనేట్ చేసినప్పుడు శరీరంలో కొత్త ప్లాస్మా ఏర్పడుతుంది. ఈ ప్రక్రియవల్ల ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. వివిధ రకాల జబ్బులు, రోగాలు, అంటు వ్యాధులు రాకుండా కాపాడుతుంది. అంతేకాకుండా రక్తదానంవల్ల క్యాన్సర్ వచ్చే రిస్క్ కూడా తగ్గుతుందని నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అమెరికా నిపుణుల అధ్యయనంలో వెల్లడైంది.



# ఊబకాయ బాధితులు మహిళలే ఎక్కువ..

ఊబకాయం.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పలువురిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో ఇదొకటి. మిగతా వారితో పోల్చితే అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడేవాళ్లల్లో డయాబెటిస్, కార్డియో వాస్క్యులర్ ఇష్యూస్, గుండె జబ్బులు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు చెప్తున్నారు. అయితే ఇటీవల ఒబేసిటీ బాధితుల సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా వందకోట్లు దాటిందని నివేదికలు పేర్కొంటుండగా, ఇందులో వయోజనులు, మహిళలే అధికంగా ఉన్నారు. ఒబేసిటీ కారణంగా వీరు రకరకాల అవస్థలు ఎదుర్కొంటున్నారు. బాధితుల్లో 80 శాతం వయోజనులే..లాన్సెట్ మెడికల్ జర్నల్‌లో పబ్లిషైన ఒక అధ్యయనం ప్రకారం.. వరల్డ్ వైడ్‌గా స్థూలకాయంతో ప్రాబ్లమ్స్ ఫేస్ చేస్తున్న వంద కోట్లమందిలో 88 శాతం పెద్దలు కాగా, 15 కోట్ల 90 లక్షల మంది యోజనులు ఉంటున్నారు. అలాగే ఆయా ప్రాంతాలను పరిగణించినప్పుడు అమెరికన్ సమోవా ప్రాంతంలో ఒబేసిటీ సమస్యను ఎక్కువగా మహిళలు ఎదుర్కొంటున్నారు. ఇక పురుషుల విషయానికి వస్తే ఇక్కడి సమోవాతోపాటు నౌరులలో ఎక్కువగా ఈ ప్రాబ్లం ఫేస్ చేస్తున్నారు. ఇక్కడ 70 నుంచి 80 శాతం వరకు వయోజనులు ఊబకాయంతో బాధపడుతున్నారని నిపుణులు చెప్తున్నారు. ఇక భారత దేశం విషయానికి వస్తే ఇక్కడ స్త్రీలలో ఒబేసిటీ స్థానాన్ని పరిగణించినప్పుడు 19వ స్థానంలో, అలాగే పురుషులను పరిగణించినప్పుడు 21వ స్థానంలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఒబేసిటీ పెరిగిపోవడం అనేది బాధితుల్లో ప్రాణాంతకంగా మారుతోంది. ముఖ్యంగా హార్ట్ ఇష్యూస్, టైప్ 2 డయాబెటిస్, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులకు కారణం అవుతోంది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు అధిక బరువు, ఊబకాయం పెరగడానికి దారితీస్తున్నాయి. అలాగే కొందరిలో జన్యుపరంపరంగానూ ఈ సమస్య ఉంటోంది. ఆరోగ్య కరమైన ఆహార నియమాలు, వ్యాయామాలు, హెల్తీ లైఫ్ స్టైల్ అలవర్చుకోవడం కారణంగా ఈ సమస్యను అదుపులో పెట్టవచ్చని నిపుణులు చెప్తున్నారు.







# అధిక ఉష్ణోగ్రతల నడుమ పనిచేసే గర్భిణులకు ప్రమాదమా!

ప్రపంచ పర్యావరణ వ్యవస్థలో తీవ్రమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంతో పోల్చితే భూగోళం వేడెక్కడం, అధిక ఉష్ణోగ్రతలు పెరగడంవల్ల ప్రజలు పలు రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వేసవిలో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంటుంది. ఎండ వేడికి తట్టుకోలేక మనుషులే కాదు, వివిధ జీవాలు అవస్థలు పడుతుంటాయి. అయితే ఎండల్లో పనిచేయాల్సి రావడంవల్ల గర్భిణులైన శ్రామిక మహిళల్లో అబార్షన్ అయ్యే అవకాశం పెరుగుతుందని ఒక అధ్యయనం పేర్కొన్నది. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల నడుమ వర్క్ చేసే గర్భిణులు అబార్షన్‌కు గురికావడం లేదా ప్రసవ సమయంలో బిడ్డను కోల్పోవడం వంటి ప్రాబ్లమ్స్ పెరుగుతున్నాయి. అయితే ఈ పరిస్థితి కేవలం ఉష్ణ మండల ప్రాంతాల్లో మాత్రమే కాకుండా, భారత్, బ్రిటన్ సహా యూరోపియన్ దేశాల్లోనూ ఉంటోంది. స్టడీలో భాగంగా యూకేకు చెందిన జార్జ్ ఇన్‌స్టిట్యూట్‌లోని గ్లోబల్ ఉమెన్స్ హెల్త్ వింగ్ నిపుణులు వివిధ దేశాల్లో అధిక ఉష్ణోగ్రతల మధ్య పనిచేసే మహిళల హెల్త్ డేటాను విశ్లేషించారు. ఎండాకాలంలో ఇటుక బట్టీలు, ఉప్పు తయారీ పరిశ్రమలు, వ్యవసాయ పనులు, పరిశ్రమల్లో అధిక ఉష్ణోగ్రతల నడుమ పనిచేయాల్సి రావడంవల్ల మహిళల్లో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా గర్భిణులు నెలలు నిండకముందే ప్రసవించడం లేదా అబార్షన్లకు గురికావడం పెరుగుతోందని కనుగొన్నారు. ఎండ తీవ్రవ, వేడిగాల ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పనిచేసేవారితో పోల్చితే, సాధారణ వాతావరణం లేదా చల్లటి వాతావరణంలో పనిచేసే మహిళల్లో హెల్త్ ఇష్యూస్ చాలా తక్కువగా ఉంటున్నాయని నిపుణులు అంటున్నారు. హీట్‌వేవ్, హై టెంపరేచర్ మధ్య పనిచేయాల్సి రావడం కరాణంగా నెలలు నిండకముందే ప్రసవాలు, అబార్షన్లకు గురికావడం, డీహైడ్రేషన్ కేసులు పెరగడం వంటివి ఇప్పటికే 5 శాతం వరకు ఉంటున్నాయని, రాబోయే కాలంలో ప్రపంచ వ్యాప్తంగా 15 శాతం పెరిగే ప్రమాదం ఉందని రీసెర్చర్స్ అంటున్నారు. అలాగే శిశువులు, వృద్ధుల మరణాల సంఖ్య పెరగవచ్చని కూడా పేర్కొంటున్నారు.

# ఆస్తమా పేషెంట్లు ఏసీ గదుల్లో కూర్చోవచ్చా..

ఎండలు మండిపోతున్నాయి. ప్రతి ఒక్కరూ వారి ఇళ్ళలో ఏసీ వేసుకుని రెస్ట్ తీసుకుంటూ ఉంటారు. అయితే, ఆస్తమా రోగులు ఏసీ రూమ్‌లో కూర్చునే ముందు వీటి గురించి తెలుసుకోవాలి.ఎందుకంటే ఆస్తమా రోగులకు చల్లని గాలి ప్రమాదకరం. వాతావరణంలోని ధూళి కణాలు ఎయిర్ కండీషనర్‌లో కరిగి ఆస్తమా రోగులకు హాని కలిగిస్తాయి. పీల్చినప్పుడు, ధూళి కణాలు ఉబ్బసం ఉన్నవారి ఊపిరితిత్తులలోకి ప్రవేశిస్తాయి. ఇది మీ సమస్యను మరింత పెంచే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో, ఇది ఉబ్బసం ఉన్నవారికి కూడా ప్రాణాంతకం కావచ్చు. కాబట్టి ఆస్తమా రోగులు ఏసీలో కూర్చునే ముందు ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు అంటున్నారు. ఆస్తమా ఒక ప్రమాదకరమైన వ్యాధి. దీని వల్ల శ్వాసనాళాల వాపు వస్తుంది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌కి కూడా కారణం కావచ్చు. దీంతో ఈ వ్యక్తి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడొచ్చు. అంతే కాకుండా , శ్వాస తీసుకునేటప్పుడు నిరంతరం శ్వాసలో గురక, దగ్గు సమస్య కూడా కొంతమంది రోగులకు పొడి దగ్గు ఉంటుంది. నిద్రలో కూడా తరచుగా దగ్గు వస్తుంది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రుక్మిణీ వసంత్ పేరుతో మోసం.. అభిమానులకు హెచ్చరిక!

'సప్తసాగరాలు దాటి' చిత్రంతో తెలుగు, కన్నడ ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నటి రుక్మిణీ వసంత్ తాజాగా సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. తన పేరును దుర్వినియోగం చేస్తూ మోసాలు జరుగుతున్నాయని ఆమె బహిరంగంగా హెచ్చరించారు. రుక్మిణీ వెల్లడించిన వివరాల ప్రకారం, గత కొన్ని రోజులుగా ఒక వ్యక్తి 9445893273 అనే నంబర్ ద్వారా ఆమె లాగా మాట్లాడుతూ, అభిమానులను, సినీ పరిశ్రమ వ్యక్తులను, బ్రాండ్ ప్రతినిధులను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆ వ్యక్తి తన స్వరాన్ని కూడా రుక్మిణీలా మార్చి మాట్లాడుతున్నందున చాలా మంది అయోమయానికి గురవుతున్నారని ఆమె తెలిపింది.దీనిపై రుక్మిణీ క్లారిటీ ఇస్తూ.. ఆ నంబర్ నాది కాదు. ఆ నంబర్ నుంచి వచ్చే కాల్స్ లేదా మెసేజ్‌లకు స్పందించవద్దు. నా పేరును, స్వరాన్ని వాడి మోసాలు చేయడం సైబర్ నేరం. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాను, అవసరమైతే పోలీసు కేసులు కూడా పెడతాను అని తెలిపారు. ఆమె అభిమానులకు, సోషల్ మీడియా ఫాలోవర్స్‌కి జాగ్రత్తగా ఉండాలని, ఏమైనా అనుమానం కలిగితే తన టీమ్‌ను నేరుగా సంప్రదించమని సూచించారు. ఈ హెచ్చరిక పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమానులు రుక్మిణీకి మద్దతు తెలుపుతూ, ఇలాంటి మోసగాళ్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.సినిమాల విషయానికి వస్తే, రుక్మిణీ ప్రస్తుతం కన్నడ స్టార్ హీరో యశ్ సరసన నటిస్తున్న ' టాక్సిక్' చిత్రం షూటింగ్‌లో బిజీగా ఉంది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో, కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. యశ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. 'టాక్సిక్' సినిమా సాధారణ మాస్ ఎంటర్‌టైనర్ కాదు. భావోద్వేగాలతో నిండి, రా అండ్ రస్టిక్ స్టైల్లో ఉండే శక్తివంతమైన కథ ఇది. ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడం నాకు గర్వకారణం అని రుక్మిణీ తెలిపింది. ప్రస్తుతం రుక్మిణీ కన్నడతో పాటు తెలుగు, తమిళ భాషల్లో కూడా వరుస ప్రాజెక్టులపై సంతకాలు చేస్తూ సౌత్‌లో అత్యంత క్రేజీ హీరోయిన్‌గా నిలుస్తున్నారు.



# విజయ్‌ని పెళ్లి చేసుకుంటా.. ఎట్టకేలకు స్పష్టతనిచ్చిన రష్మిక

తన భాగస్వామి ఎలా ఉండాలని కోరుకుంటున్నారో చెప్పాలని ఒక అభిమాని కోరగా రష్మిక నవ్వుతూ దానికి సమాధానమిచ్చారు. ప్రపంచం మొత్తం తనకు వ్యతిరేకంగా ఉన్నా కూడా తన కోసం నిలబడే జీవిత భాగస్వామి కోసం వెతుకుతున్నట్లు వివరించారు. ''నిజాయితీగా చెప్పాలంటే నన్ను లోతుగా అర్థం చేసుకునే వ్యక్తి. ప్రతి విషయాన్ని నావైపు నుంచి ఆలోచిస్తూ అర్థం చేసుకోవాలి. అన్ని పరిస్థితులను ఎదుర్కొనే వ్యక్తి.. ఎలాంటి దాన్నైనా అర్థం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిని నేను కోరుకుంటున్నాను. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి, నాకోసం యుద్ధం చేయగల వ్యక్తి కావాలి. అలాంటి భాగస్వామి కోసం నేను ఎంత దూరమైనా వెళ్తాను. యుద్ధంలో తూటాకైనా ఎదురెళ్తా'' అని రష్మిక తెలిపారు. ఒకవేళ మీరు డేట్ చేస్తే ఎవరితో చేస్తారు? పెళ్లి చేసుకుంటే ఎవరిని చేసుకుంటారు? అని మరో అభిమాని అడగ్గా.. ''డేట్ చేస్తే యానిమేషన్ క్యారెక్టర్ నరుటోతో చేస్తా. ఎందుకంటే నాకు నరుటో పాత్ర చాలా ఇష్టం. పెళ్లి చేసుకుంటే విజయ్‌ని చేసుకుంటా'' అని చెప్పారు. ఈ సమాధానంతో ఆడియన్స్ అందరూ పెద్దగా అరుస్తూ కంగ్రాట్స్ చెప్పారు. రష్మిక థాంక్స్ చెప్పారు. అక్టోబర్ 3న రష్మిక, విజయ్‌ల నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ ఈ మధ్య పలు ఇంటర్వ్యూల్లో రష్మిక పరోక్షంగా స్పందించారు. 'నా ఎంగేజ్‌మెంట్ విషయంలో మీరు ఏం అనుకుంటున్నారో అదే నిజం. సమయం వచ్చినప్పుడు వెల్లడిస్తా' అని అన్నారు. ఇప్పుడు విజయ్‌తో పెళ్లి విషయంలో స్పష్టమైన సమాధానమిచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరి పెళ్లి జరగనున్నట్లు టాక్ వినిపిస్తోంది.




# 50 ఏళ్ల సినీ ప్రయాణానికి రజనీకాంత్‌కు సన్మానం!

భారతీయ చలనచిత్ర పరిశ్రమకు సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించిన సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. ఇటీవల నట జీవితంలో 50 ఏళ్ల ఘన ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా 56వ అంతర్జాతీయ చలనచిత్ర ఉత్సవం ముగింపు వేడుకలో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు. ఈ సన్మానం ఐఎఫ్ఎఫ్ఐకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా.. గోవా వేదికగా నవంబర్ 20 నుంచి 28 వరకు ఈ వేడుక జరుగనుందిబస్ కండక్టర్‌గా జీవితం ప్రారంభించిన శివాజీ రావు గైక్వాడ్ అలియాస్ రజనీకాంత్... 1975లో లెజెండరీ దర్శకుడు కె. బాలచందర్ రూపొందించిన 'అపూర్వ రాగంగళ్' చిత్రంతో నట జీవితాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా, తనదైన స్టైల్‌తో, విలక్షణమైన పాత్రలతో కోట్లాది మంది అభిమానుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. తన యాక్షన్, స్టైలింగ్‌తో ఇండియా అంతటా సూపర్‌స్టార్‌గా గుర్తింపు సాధించాడు.ఇక ఈ IFFI వేడుకల్లో గురు దత్, రాజ్ ఖోస్లా, రిత్విక్ ఘటక్, పి. భానుమతి, భూపేన్ హజారికా వంటి పలు దిగ్గజ కళాకారుల శత జయంతి వేడుకలు కూడా జరగనున్నాయి. ఈ తొమ్మిది రోజుల ఉత్సవంలో 81 దేశాల నుండి 240కి పైగా చలనచిత్రాలను ప్రదర్శించనున్నారు.

# మనసు బాగోలేకపోతే శ్మశానానికి వెళ్లి వస్తా.. 'పొలిమేర' బ్యూటీ కామాక్షి భాస్కర్ల

మనసు బాలేకపోతే బయటికి షికారుకి వెళ్లి రావడం.. సినిమాకి వెళ్లడం. ట్రావెలింగ్‌కి వెళ్లడం చూస్తూ ఉంటాం. కానీ తన మనసు బాలేగకపోతే శ్మశానానికి వెళ్లి వస్తానని చెబుతుంది టాలీవుడ్ బ్యూటీ కామాక్షి భాస్కర్ల. పొలిమేర సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ తన సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొనగా.. ఈ ఇంటర్వ్యూలో తన పర్సనల్ లైఫ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కామాక్షి మాట్లాడుతూ.. నా మనసు బాలేనప్పుడు బాగా డిప్రెషన్‌లోకి వెళ్లినప్పుడు శ్మశానానికి వెళ్లి వస్తుంటా. అక్కిడికి వెళితే ఒక తెలియని ప్రశాంతత దొరుకుతుంది. చాలా ఎనర్జీ వస్తుంది. మైండ్ కూడా ఎంతో రిలీఫ్‌గా అనిపిస్తుందంటూ ఈ భామ చెప్పుకొచ్చింది. అయితే కామాక్షి మాటలను విన్న నెటిజన్లు.. హారర్ సినిమాలు చేసి చేసి కామాక్షి అందులోనే జీవిస్తుందంటూ కామెంట్లు చేస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే.. కామాక్షి ప్రస్తుతం అల్లరి నరేష్‌తో కలిసి '12ఎ రైల్వే కాలనీ' అనే థ్రిల్లర్ సినిమాలో నటిస్తుంది. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. నాని కాసరగడ్డ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు.



# ఫ్యాన్ వార్ .. అజిత్ క్లారిటీతో అయిన పులిస్టాప్ పడుతుందా?

సోషల్ మీడియా రాకతో ఫ్యాన్ వార్ ఇప్పుడు సినిమా సంస్కృతిలో విడదీయరాని భాగంగా మారిపోయింది. ఒక హీరో గురించి మరో హీరో అభిమానులు కామెంట్ చేస్తే చాలు వెంటనే చర్చలు, వాదనలు, విమర్శలు మొదలై చివరకు తగాదాల దాకా వెళ్లడం సర్వసాధారణం. ముఖ్యంగా తమిళ సినీ పరిశ్రమలో అజిత్ కుమార్, విజయ్ అభిమానుల మధ్య జరుగుతున్న వార్ ఎప్పుడూ హాట్ టాపిక్‌గానే ఉంటుంది. వీరి సినిమాలు విడుదలైన రోజున థియేటర్ల వద్ద అభిమానుల సందడి పండగలా ఉంటుంది. కానీ ఆ ఉత్సాహమే కొన్నిసార్లు ఆన్‌లైన్‌లో తగాదాలుగా మారుతుంది. నిజంగా అజిత్, విజయ్ మధ్య శత్రుత్వం ఉందా? లేక అభిమానులే సృష్టించుకున్న ఊహాగానాలా? అనే ప్రశ్నకు అజిత్ చివరికి సమాధానం ఇచ్చారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో అజిత్ మాట్లాడుతూ, "విజయ్‌తో నాకు ఎలాంటి విభేదాలు లేవు. కొంతమంది కావాలని మా మధ్య అపార్థాలు సృష్టిస్తున్నారు. అవి పూర్తిగా తప్పుడు వార్తలు. అభిమానులు వాటిని నమ్మి ఒకరినొకరు దూషించడం అనవసరం. విజయ్ నాకు సోదరుడిలాంటి వాడు. అతనికి ఎల్లప్పుడూ మంచి జరగాలని కోరుకుంటాను. గొడవలు కాకుండా సంతోషంగా జీవించడం నేర్చుకోండి," అని అభిమానులకు సూచించారు. విజయ్ రాజకీయ రంగ ప్రవేశం నేపథ్యంలో ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలను కూడా అజిత్ ఖండించారు. "మా మధ్య విషం చిమ్మే ప్రయత్నాలు చేయవద్దు," అని ఆయన హెచ్చరించారు. గమనించదగ్గ విషయం ఏమిటంటే కోలీవుడ్‌లో ఈ ఇద్దరు హీరోలు ఎప్పటినుంచో స్నేహపూర్వక సంబంధం కొనసాగిస్తున్నారు. విజయ్ కూడా గతంలో ఒక అభిమాని తెచ్చిన అజిత్-విజయ్ ఫోటోపై సిగ్నేచర్ పెట్టి తమ బాండింగ్‌ని చూపించాడు. ఆ క్షణం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇటీవల అజిత్‌కు పద్మభూషణ్ అవార్డు వచ్చినప్పుడు విజయ్ శుభాకాంక్షలు చెప్పలేదని వచ్చిన రూమర్స్‌పై అజిత్ మేనేజర్ స్పందిస్తూ, "ఆ వార్తలు తప్పు. అవార్డు ప్రకటించిన వెంటనే విజయ్ ఫోన్ చేసి అభినందించాడు. వాళ్లిద్దరూ ఎప్పటినుంచో మంచి స్నేహితులే," అని క్లారిటీ ఇచ్చారు. కోలీవుడ్‌లో హీరోలను దేవుళ్లలా చూసే అభిమానులు తమ హీరోకే ప్రాధాన్యం ఇస్తూ ఇతరులను విమర్శించడం తరచూ జరుగుతుంది. కానీ వాస్తవానికి అజిత్-విజయ్ ఇద్దరూ ఒకరినొకరు గౌరవించుకునే స్టార్‌లు. ఇటీవల విజయ్ సభలో జరిగిన తొక్కిసలాట ఘటనపై కూడా అజిత్ ఆయనకు మద్దతుగా నిలిచారు. మరి అజిత్ ఇచ్చిన ఈ క్లారిటీతో ఫ్యాన్ వార్‌కి బ్రేక్ పడుతుందా?